
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
శనివారం 8 ఫిబ్రవరి 2025



కల్పవృక్ష వాహనంపై సర్వాంతర్యామి

● నవనీత కృష్ణుడు, కోదండరాముడు అలంకారంలో స్వామివారు దర్శనం



కల్పవృక్ష వాహనంపై విహరిస్తున్న సర్వాంతర్యామి

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోసువారిపల్లెలో కొలువైన ప్రసన్న వేంకటరమణస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు టీటీడీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా నాలుగో రోజైన శుక్రవారం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటరమణస్వామి వారికి ఉదయం కల్పవృక్షవాహనం, రాత్రి హనుమంత వాహనసేవలను వేడుకగా నిర్వహించారు. శుక్రవారం వేకువనే కల్పవృక్ష వాహనంపై అలంకార భూషితులైన శ్రీదేవి, భూదేవి సమేత స్వామి వారు కొలువుదీరి నవనీత కృష్ణుడు అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కల్పవృక్షంపై కొలువైన స్వామిని దర్శించుకుంటే కోరిన కోర్కెలు తీరతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. వాహన సేవ అనంతరం ఆలయ మండపంలో స్వామి ఉత్సవర్లకు పాలు, పెరుగు, తేనే, కొబ్బరినీళ్లు, పసుపు, చందనం వంటి సుగంధద్రవ్యాలతో కన్నుల పండువగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. రాత్రి దేవదేవుడు కోదండరాముడి అలంకారంలో హనుమంత వహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. భక్తుల గోవిందనామస్మరణలు, భజన బృందాల చెక్కభజనలు, కోలాటలతో స్వామి వారిని కీర్తిస్తుండగా మంగళవాయిద్యాల నడుమ స్వామివారి వాహన సేవ వైభవంగా జరిగింది. బ్రహ్మోత్సవాల్లో శనివారం ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి చంద్రప్రభ వాహన సేవలు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి, వేదపండితులు కృష్ణప్రసాద్ భట్టర్, రమేష్‌స్వామి, టీడీపీ మండలాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, సిద్దమ్మ, క్లస్టర్ ఇన్‌చార్జి బేరిశీన, సోముశేఖర్, ఆదిరెడ్డి, గంగులిరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్‌లో హైకోర్టు జడ్జిలు

● మర్యాదపూర్వకంగా కలిసిన జేసీ, సబ్‌కలెక్టర్
● ప్రోటోకాల్ ఏర్పాట్లలో అధికారులు బిజీ

బి.కొత్తకోట, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌లో రాష్ట్ర హైకోర్టు జడ్జిలు విడిది చేశారు. మదనపల్లె, పలమనేరులలో నూతన కోర్టు భవనాల ప్రారంభోత్సవాల్లో పాల్గొనే నిమిత్తం జిల్లాకు విచ్చేసిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్‌ఠాకూర్, హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ చంద్రధనశేఖర్, జస్టిస్ కిష్ణమోహన్‌లు విచ్చేశారు. శుక్రవారం రాత్రి హార్సిలీహిల్స్‌లోని గవర్నర్ బంగ్లా, పోలీస్ గెస్టహౌస్‌లలో వీరికి అధికారులు విడిది ఏర్పాట్లు చేశారు. జేసీ ఆదర్శరాజేంద్రన్, మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్‌లు హార్సిలీహిల్స్ చేరుకొని హైకోర్టు న్యాయమూర్తులకు సాదర స్వాగతం పలికారు. బస ఏర్పాట్లపై సమీక్షించారు. రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఇతర న్యాయమూర్తులతో పాటు, సుప్రీంకోర్టు జడ్జి కూడా మదనపల్లె కార్యక్రమానికి హాజరు కానుండడంతో రెవెన్యూ, పోలీస్ అధికారులు ప్రోటోకాల్ ఏర్పాట్లలో బిజీబిజీగా ఉన్నారు. ఇతర ప్రాంతాల నుంచి అదనపు బలగాలను రప్పించి బందోబస్తును ఏర్పాటు చేశారు. బి.కొత్తకోట సీఐ జీవన్‌గంగనాథ్‌బాబు, తహశీల్దార్ అజారుద్దీన్‌లు పర్యవేక్షించారు. శనివారం ఉదయం హార్సిలీహిల్స్ నుంచి బయలుదేరి ప్రారంభోత్సవ కార్యక్రమాలకు న్యాయమూర్తులు వెళతారు.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు..!



● సెలవులో తహసీల్దార్ ఖాజాబీ ● ఇన్‌చార్జిగా ధనంజేయులు ● న్యాయస్థానానికి ఖాజాబీ ?

మదనపల్లె, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): సంచలనాలకు నిలయంగా మారిన మదనపల్లె తహసీల్దార్ ఎస్.ఖాజాబీ కలెక్టర్ ఆదేశాలు పట్టించుకోలేదు. స్థానికంగా కొన్ని రోజులుగా జరుగుతున్న సంఘటనల నేపథ్యంలో కలెక్టర్.. ఖాజాబీని నిమ్మనపల్లెకు, నిమ్మనపల్లె తహసీల్దార్ ధనంజేయులును మదనపల్లెకు డిప్యూటేషన్‌పై బదిలీ చేశారు. అయితే ఖాజాబీ వివిధ కారణాలతో సెలవులో వెళ్లగా, నిమ్మనపల్లెలో జాయిన్ కాలేదు. అయితే అక్కడి తహసీల్దార్ మాత్రం శుక్రవారం మదనపల్లెలో అదనపు బాధ్యతలు తీసుకున్నారు.

మూడునెలల క్రితం మదనపల్లెకు బదిలీపై వచ్చిన ఖాజాబీ, స్థానిక ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషాల మధ్య వివాదం తలెత్తింది. ఈ నేపథ్యంలో విధి నిర్వహణలో తహసీల్దార్, అవినీతి, అక్రమాలకు పాల్పడుతోందని, ఈమెను బదిలీ చేయాలని ఎమ్మెల్యే.. కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఇందుకు ప్రతిగా ఖాజాబీ కూడా ఓ అడుగు ముందుకేసి నారావారిపల్లెకు విచ్చేసిన సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్‌కు ఎమ్మెల్యేపై ఫిర్యాదు చేశారు. పాలనా వ్యవహారాల్లో ఎమ్మెల్యే ఎక్కువగా జోక్యం చేసుకుంటున్నారని, విధి నిర్వహణలో అడ్డుపడుతున్నారని సీఎం, మంత్రికి ఇచ్చిన ఫిర్యాదులో తహసీల్దార్ పేర్కొన్నారు. ఈ వ్యవహారం చివరకు ప్రభుత్వ పెద్దల వరకూ వెళ్లింది. కాగా ఎమ్మెల్యే ఒత్తిడితో అప్పట్లోనైతే తనకు ఎమ్మెల్యేతో విభేదాలు లేవని తహసీల్దార్ ప్రకటించారు. కానీ ఈ క్రమంలో వీరిని కలిపే ప్రయత్నం చేసినా.. ప్రయోజనం లేకపోయింది. ఈ క్రమంలో తహసీల్దార్.. జనవరి 26వ తేదీ లోపు బదిలీపై వెళ్తారని ప్రచారం సాగింది. ఆమె ఇక్కడే ఉండటంతో తర్వాత ఎమ్మెల్యే, తహసీల్దార్ పరస్పర అవగాహనతో పనిచేస్తున్నారని, ఇక ఇబ్బంది లేదనే పరిస్థితి కనిపించింది. ఈ క్రమంలో తరచూ ఎమ్మెల్యే అనుచరులు తహసీల్దార్‌ను కలవడం, చర్చలు జరపడం కూడా అందుకు బలాన్నిచ్చింది. ఇదిలా వుండగా, తాజాగా తహసీల్దార్‌పై రెవెన్యూ శాఖమంత్రి అనగాని సత్యప్రసాద్, రెవెన్యూశాఖ ప్రత్యేక కార్యదర్శి ఆర్.పి.సిసోడియాకు ఫిర్యాదులు వెళ్లాయి. ఈమె విధి నిర్వహణలో అక్రమాలకు పాల్పడ్డారని, నిబంధనలకు విరుద్ధంగా భూముల మ్యూటేషన్ చేశారన్నది అందులోని సారాంశం. ఈమెపై ఎమ్మెల్యే అనుచరులే ఫిర్యాదు చేశారని స్థానికంగా ప్రచారంలో వుంది. ఈ ఫిర్యాదుపై స్పందించిన మంత్రితో పాటు సిసోడియా విచారణకు ఆదేశించారు. విచారణ బాధ్యతను కలెక్టర్ శ్రీధర్‌కు అప్పగించగా, ఆయన స్థానిక సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్‌ను ఆదేశించినట్లు తెలిసింది. ఇందులో భాగంగా సబ్‌కలెక్టర్ రెండురోజుల పాటు తహసీల్దార్‌తో సమావేశమై చర్చించారు. ఇందులో భాగంగా ఫిర్యాదులో పేర్కొన్న రెవెన్యూ గ్రామం, సర్వేనంబర్ల ఆధారంగా విచారణ చేపట్టి, నివేదికను కలెక్టర్‌కు పంపారు. ఈ క్రమంలోనే డిప్యూటేషన్‌పై బదిలీ వచ్చినట్లు చెబుతున్నారు. అనంతరం తహసీల్దార్ కూడా విజయవాడకు వెళ్లి రెవెన్యూశాఖ మంత్రిని కలిసి ఫిర్యాదుపై వివరణ ఇచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. అయితే మంత్రి కూడా నిమ్మనపల్లెలో కొంతకాలం డిప్యూటేషన్‌పై పనిచేయాలని సూచించినట్లు తెలిసింది. ఇదే విషయాన్ని కలెక్టర్ కూడా ఖాజాబీకి సూచించారు. అయితే మదనపల్లె నుంచి రిలీవ్ కాకుండా, నిమ్మనపల్లెలో జాయిన్ కాకుండా ఆమె సెలవులో వెళ్లారు. కలెక్టర్ ఆదేశాలు పాటించాలన్న నేపథ్యంలో తహసీల్దార్ ఖాజాబీ.. హైకోర్టును ఆశ్రయించినట్లు తెలిసింది. ఏ కారణం చేత తనను మూడు నెలల్లోనే బదిలీ చేశారో చెప్పాలని న్యాయస్థానం తలుపు తట్టినట్లు తెలిసింది.

ఇదిలా వుండగా, విజయవాడకు వెళ్లిన తహసీల్దార్.. కార్యాలయంలో తనకు కాని ముగ్గురి సిబ్బందిపై అనుమానం వ్యక్తం చేస్తూ ప్రభుత్వ పెద్దలకు చెప్పినట్లు తెలిసింది. కార్యాలయంలో జరుగుతున్న పాలన, ఇతర వ్యవహారాలన్నీ ఆది నుంచీ వారే ఎమ్మెల్యేకు, వారి మనుషులకు చేరవేస్తున్నారని అనుమానం వ్యక్తం చేయడమే కాదు.. జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో వారి ముగ్గురిపై చర్యలకు సిఫార్సు చేయగా, కలెక్టర్, సబ్‌కలెక్టర్ చర్యలు తీసుకున్నారు. ఇదిలా వుండగా, మొదటి నుంచీ మదనపల్లెలో పని చేయడానికి ముందుకు రాని తహసీల్దార్ ధనంజేయులును ఎమ్మెల్యే సూచనలతో వారే ముందుండి శుక్రవారం మదనపల్లెకు తీసుకొచ్చినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈ అంశాలను పక్కన పెడితే, సెలవులో ఉన్న ఖాజాబీ మళ్లీ మదనపల్లెలో జాయిన్ అవుతారా? లేక సెలవులోనే ఉంటూ మరోచోటకు బదిలీకి ప్రయత్నిస్తారా? అన్నది తెలియాల్సి వుంది.



మదనపల్లె తహసీల్దార్ కార్యాలయం

గంజాయి పీల్చేస్తున్నారు

● విద్యకు దూరమై.. మత్తుకు బానిసై
● పెడదోవ పడుతున్న యువత
● గుట.. గుటా తాగేస్తున్న కర్ణాటక మద్యం
● అధికారుల నిర్లక్ష్యమే కారణమా..?

6



ఉర్దూ అకాడమీకి తూట్లు పొడిచిన వైసీపీ

6

● రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, శాసనమండలి మాజీచైర్మన్ ఎంఏ షరీఫ్

ములకలచెరువులో 144 సెక్షన్

6

● ఎంపీడీఓ కార్యాలయం దారులన్నీ బంద్ ● పోలీసుల మోహరింపు

గంజాయి నిషాలో విద్యార్థులు తూగుతున్నారు. తల్లిదండ్రుల పర్యవేక్షణ లేకపోవడంతో విద్యకు దూరమై.. మత్తుకు బానిసయ్యారు. స్కూల్, కళాశాల పేరుతో ఇంట్లో నుంచి రావడం.. ఊరికి దూరంగా వెళ్లి గంజాయిని పీల్చేస్తున్నారు. పట్టణంలోని ఉద్యోగుల పిల్లలు సైతం గంజాయి, మద్యానికి అలవాటుపడి పెడదోవ పడుతున్నారు. ఎటుచూసినా కర్ణాటక మద్యం ప్యాకెట్లు, మాదక ద్రవ్యాలే దర్శనమిస్తున్నాయి. పోలీసులు చర్యలు తీసుకొని, యువతకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తే కొద్ది మేర తగ్గే అవకాశం ఉంది.


వాల్మీకిపురం రైల్వే ట్రాక్‌పై తిరుగుతున్న విద్యార్థులు

వాల్మీకిపురం రైల్వే స్టేషన్ ప్రాంతంలో రహస్యంగా యువకుల సెల్‌ఫోన్ మంతనాలు

గంజాయి పీల్చేస్తున్నారు..!

- విద్యకు దూరమై.. మత్తుకు బానిసై
- పెడదోవ పడుతున్న యువత
- గుట.. గుటా తాగేస్తున్న కర్ణాటక మద్యం
- అధికారుల నిర్లక్ష్యమే కారణమా..?

వాల్మీకిపురం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రాంతాల్లో గంజాయి, కర్ణాటక మద్యం విక్రయాల వాడకం ఎక్కువైందని ఆరోపణలు వస్తున్నాయి. వీటి అక్రమ రవాణా సులభతరం కావడంతో పట్టణంలోని జగనన్న కాలనీ, బైపాస్ రోడ్డుకు సమీపాన అటవీ ప్రాంతం వద్ద యువత ఎక్కువగా గంజాయి మత్తులో ఉంటున్నట్లు పలువురు చెబుతున్నారు. అలాగే స్థానిక రైల్వేస్టేషన్ ప్రాంతం, సమీప వ్యవసాయ పొలాల వద్ద యువకులు రహస్యంగా గుమికూడి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్న విమర్శలున్నాయి. పట్టణంలోని ఉద్యోగుల పిల్లలు సైతం గంజాయికి బానిసలై పెడదోవ పడుతున్నట్లు తెలిసింది. ముఖ్యంగా విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లకుండా మత్తులో తూగుతున్నారు. పోలీసులు గంజాయి, మద్యం అక్రమ రవాణాపై నిఘా పెట్టాలని పలువురు కోరుతున్నారు.

శ్రుతిమించిపోతున్న మందుబాబుల ఆగడాలు

స్థానిక ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంతంలో నిత్యం మందుబాబుల ఆగడాలు శ్రుతిమించిపోతున్నాయి. డిగ్రీ కళాశాల, ఉర్దూ హైస్కూల్, పరిసరాల్లో మద్యం దుకాణం ఉండడం, ఉదయం దుకాణం తెరిచిన సమయం నుంచి సాయంత్రం వరకు ఆ ప్రాంతంలో మందుబాబుల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. నిత్యం కళాశాల సమీపంలో మందుబాబుల చేసే చేష్టలకు విస్తుపోతున్నారు. ఈ వ్యవహారంపై స్థానిక అధికారులు సైతం ఏమీ చేయలేక మిన్నకుండిపోయినట్లు తెలిసింది. కళాశాల ముఖద్వారం సమీపంలో ముళ్లపొదలు విపరీతంగా పెరిగిపోవడం, ఎటుచూసినా మద్యం బాటిళ్ల దుర్గంధమే దర్శనమిస్తోంది. యువత ఈ వ్యవహారం పట్ల ఆకర్షితులై జీవితాలను దుర్భరం చేసుకోకుండా పోలీసులు కూడా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. అలాగే వాల్మీకిపురంలో గంజాయి, కర్ణాటక మద్యం అక్రమ రవాణాతో విక్రయాలు సాగిస్తున్న వ్యక్తులపై పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎటు చూసినా కర్ణాటక మద్యం ప్యాకెట్లే...

రెండేళ్ల కాలంగా వాల్మీకిపురం పట్టణ వ్యాప్తంగా కర్ణాటక మద్యం ఏరులై పారుతోంది. అర్ధరాత్రి సమయాల్లో కర్ణాటక మద్యం అక్రమంగా తరలించడంతో పాటు విక్రయాలకు ఈ ప్రాంత పరిసరాలు కేంద్రంగా మారాయి. ఎటు చూసినా తాగి పడేసిన కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు దర్శనమిస్తుంటాయి. పోలీసులు కర్ణాటక అక్రమ మద్యంపై ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టి కేసులు నమోదు చేసినప్పటికీ అక్రమ మద్యం మాత్రం వస్తూనే ఉంది. స్థానిక ఆర్టీసీ బస్టాండ్, జగనన్న కాలనీ, ఇందిరమ్మకాలనీ, తరిగొండ రోడ్డు, రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాలలో కర్ణాటక అక్రమ మద్యం విచ్చలవిడిగా విక్రయాలు కొనసాగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.


వాల్మీకిపురంలో మందుబాబులు తాగి పడేసిన కర్ణాటక మద్యం ప్యాకెట్లు

ముమ్మర నిఘా పెట్టాం



వాల్మీకిపురం మండల వ్యాప్తంగా గంజాయి, కర్ణాటక అక్రమ మద్యం, నాటుసారా తయారీ, విక్రయాలపై ముమ్మర నిఘా పెట్టి చర్యలు తీసుకుంటున్నాం. గంజాయి విక్రయాలు, వాడకంతో పట్టుబడితే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదు. మద్యం మత్తులో జీవితాలను దుర్భరం చేసుకుంటున్నామన్న విషయాన్ని ముఖ్యంగా యువత గమనించాలి. కర్ణాటక మద్యం అక్రమ రవాణా, విక్రయాలపై సర్కిల్ పరిధిలోని వాల్మీకిపురం, గుర్రంకొండ మండలాల్లో గట్టి నిఘా పెట్టి చర్యలు తీసుకుంటున్నాం. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల భవిష్యత్తు విషయమై ఎప్పటికప్పుడు శ్రద్ధ వహించాలి. ఎక్కడైనా సరే గంజాయి, కర్ణాటక మద్యం, నాటుసారా విక్రయాల విషయం తెలిస్తే తక్షణం పోలీసులకు సమాచారం అందించాలి.

- ప్రసాద్‌బాబు, సీఐ, వాల్మీకిపురం

ఇద్దరు దొంగలు అరెస్ట్

- రూ.99 వేల విలువైన వెండి వస్తువులు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న వెండి వస్తువులు, నిందితులతో ఏఎస్పీ

నందలూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కడప - తిరుపతి ప్రధాన రహదారిలోని మూసివేసిన ఆల్విన్ కర్మాగారం వద్ద శుక్రవారం ఇద్దరు దొంగలను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.99 వేల విలువైన వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు రాజంపేట ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్ హెగ్డే తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శుక్రవారం ఉదయం 11.30 గంటల సమయంలో ఆల్విన్ ఫ్యాక్టరీ గేటు వద్దకు వెళ్లిన ఎస్ఐ వెంకటేశ్వర్లును చూసి పారిపోయేందుకు ప్రయత్నించిన తలారి బాలకృష్ణ, పుల్లగుంట రామాంజిని వెంబడించి అదుపులోకి తీసుకున్నారన్నారు. వారి వద్ద ఉన్న సంచిలో మూడు వెండి కిరీటాలు, రెండు వెండి పళ్లాలు, మూడు వెండి దీపాలు ఒక శఠగోపము గుర్తించి స్వాధీనం చేసున్నారని తెలిపారు. ఆడపూరులోని మంచాలమ్మ ఆలయంలో గత డిసెంబరు 24న చోరీకి గురైన వస్తువులుగా వీటిని గుర్తించామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. ఈ కేసులో కీలకంగా వ్యవహరించిన కానిస్టేబుల్ దర్బార్‌బాసాను ఏఎస్పీ అభినందించారు. ఈ సమావేశంలో రాజంపేట రూరల్ సీఐ బీవీ రమణ, ఏఎస్ఐలు సుబ్బరాయుడు, శంకర్‌నాయక్, హెడ్‌కానిస్టేబుల్ రాజగోపాల్, పోలీసులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్యాయత్నం

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని పోలీసులు తెలిపారు. మదనపల్లె ఆస్పత్రి అవుట్ పోలీసుల వివరాల మేరకు... బీకొత్తకోట మండలం, గట్టు పంచాయతీ, తొట్లవారిపల్లెకు చెందిన దేవేంద్ర భార్య లిఖిత(19)ఓ ప్రైవేటు కళాశాల్లో ఇంటర్ చదువుతోంది. శుక్రవారం తన మామ చిన్నపరెడ్డి గొడవ పడడంతో మనస్తాపానికి గురై విషద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబసభ్యులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

నాలుగు నియోజకవర్గాల తాగునీటికి జేజేఎం పథకం

- రూ. 2,904 కోట్లతో నూతన ప్రాజెక్టుకు డీపీఆర్
- వెలిగల్లు నుంచి నీటి సరఫరా


మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మదనపల్లె, పుంగనూరు, పలమనేరు, కుప్పం నియోజకవర్గాల ప్రజలకు తాగునీరు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.2,904కోట్ల అంచనాతో వెలిగల్లు రిజర్వాయర్ నుంచి నీటి సరఫరాకు నూతన ప్రాజెక్టు కోసం డీపీఆర్ (డీటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు) తయారు చేసిందని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే నివాసం వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రతి వేసవిలోనూ పట్టణాలు, గ్రామాల్లో తాగునీటి సమస్య వస్తోందని, దీన్ని దృష్టిలో పెట్టుకుని జల్‌జీవన్ మిషన్ కింద ఓవర్‌హెడ్ ట్యాంకులు, పైప్‌లైన్లు వేస్తారన్నారు. నియోజకవర్గంలో మదనపల్లె సహా 640 గ్రామాల్లో ప్రతి ఇంటికీ తాగునీటిని అందించేందుకు ఈ పథకాన్ని అమలు చేస్తారన్నారు. ఈ ప్రాజెక్టు పనులకు త్వరలోనే టెండర్లు పిలుస్తారని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు భవిష్యత్‌లో 30 ఏళ్లకు సరిపడా ప్రణాళికలతో పథకాలు అమలు చేస్తారన్నారు. మదనపల్లెను జిల్లా కేంద్రంగా చేసేందుకు చంద్రబాబు సుముఖంగా వున్నారన్నారు. మదనపల్లెలో ఆటోనగర్ ఏర్పాటుకు పూర్తిగా కృషి చేస్తానన్నారు. చిత్తూరు బస్టాండు నుంచి డీఎస్పీ కార్యాలయం వరకు రోడ్డు 100 అడుగుల వెడల్పు చేసేందుకు ప్రతిపాదనలు సీఎం దృష్టికి తీసుకెళ్లగా, ఆయన ఆర్అండ్‌బీ అధికారులను సర్వే చేయాలని ఆదేశించారన్నారు. పట్టణ శివారులో ఔటర్ రింగ్ రోడ్డుకు కృషి చేస్తామన్నారు. ప్రభుత్వాస్పత్రిని ప్రైవేటు పరం చేయనీయమని, మెడికల్ కాలేజిని పీపీపీ విధానంలోకి తీసుకొస్తామన్నారు. శనివారం తమ కార్యాలయం వద్ద ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) నిర్వహిస్తున్నామని, ప్రజలు వారి సమస్యలను తన దృష్టికి తీసుకురావచ్చన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ఆర్జే వెంకటేశ్, సుద్దిళ్ల సుధాకర్, నాదెళ్ల శివన్న, షంషీర్, చిన్న మహేష్, ఎంపీటీసీ దేవేంద్ర, బెల్లె రెడ్డిప్రసాద్, జేసీబీ మధు, కమలమర్రి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ఇదో రకం అధికార దర్పం...!

పీలేరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల్లో మహిళా ప్రజాప్రతినిధుల స్థానంలో వారి భర్త లేదా సంతానం పెత్తనం చెలాయించడం మనం చూస్తూ ఉంటాం. పెత్తనం చెలాయించినా అధికారిక కార్యక్రమాల్లో మాత్రం వారిని ఉత్సవ విగ్రహాల్లానైనా అప్పుడప్పుడూ వేదికలపై కూర్చోనిస్తారు. శిలాఫలాకాల్లో వారి పేర్లు వేయిస్తూ ఉంటారు. పీలేరు పంచాయతీ పాలకవర్గం మాత్రం ఇంకో అడుగు ముందుకు వేసి అధికారికంగా ఆవిష్కరించిన శిలాఫలకంలోనూ మహిళా వార్డు సభ్యుల పేర్ల కంటే ముందు వారి భర్తల పేర్లు వేయించి సరికొత్త ట్రెండ్‌కు తెరలేపారు. కాస్త ఆలస్యంగా వెలుగు చూసిన ఈ వ్యవహారం ఇలా ఉంది పీలేరు పంచాయతీ కార్యాలయం మీద శాశ్వత జాతీయ జెండాను ఆవిష్కరణ, మొదటి అంతస్తును(అది ఇంకా పూర్తి కాలేదు) 2023లో ఆర్భాటంగా ప్రారంభించారు. ఆ సందర్భంగా అప్పటి ప్రజాప్రతినిధులు, పంచాయతీ పాలకవర్గసభ్యులు, అధికారుల పేరిట శిలాఫలకం ఏర్పాటు చేశారు. ఆ శిలాఫలకంలో 2, 3, 5, 8, 10, 15, 18 వార్డుల్లో ఉండాల్సిన మహిళా సభ్యుల పేర్ల కంటే ముందు వారి భర్తల పేర్లు వేశారు. దీంతో ఆ శిలాఫలకం చూసిన వారు, ఇంతకీ వార్డు మెంబర్లు మహిళలా, పురుషులా అంటూ అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా పంచాయతీ సమావేశాల్లోనూ మహిళా సభ్యులు కనిపించరని పంచాయతీ సిబ్బంది గుసగుసలాడుకుంటున్నారు.

వార్డు	రికార్డుల్లో ఉన్న పేరు	శిలాఫలకంలో పేరు
2వ వార్డు	కె.లావణ్య	కె.నరేష్ లావణ్య
3వ వార్డు	ఎస్.లలితమ్మ	ఎస్.నాగభూషణ లలితమ్మ
5వ వార్డు	వై.సంధ్యావాణి	వై.మల్లికార్జున రెడ్డి సంధ్యావాణి
8వ వార్డు	ఎ.అస్మా తబస్సుం	ఎస్.మస్తాన్ అస్మా తబస్సుం
10వ వార్డు	జి.ఇస్మతారా బేగం	జి.కాలేషా ఇస్మతారా బేగం
15వ వార్డు	కె.సుకన్య	కె.పవన్ సుకన్య
18వ వార్డు	బుక్కే. కళావతి	బుక్కే. నాగరాజు కళావతి


పీలేరు పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన శిలాఫలకం

ములకలచెరువులో 144 సెక్షన్

- ఎంపీడీఓ కార్యాలయం దారులన్నీ బంద్
- పోలీసుల మోహరింపు
- ప్రశాంతంగా మండల సమావేశం


ఎంపీడీఓ కార్యాలయం వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

ములకలచెరువు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండల సమావేశం సందర్భంగా ములకలచెరువు మొత్తం పోలీసుల ఆధీనంలోకి వెళ్లింది. ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లే దారుల న్నింటిలో పోలీసులు మోహరించారు. సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులను మాత్రమే అనుమతించారు. 144 సెక్షన్ విధించడం, భారీ బందోబస్తు నడుమ ఎట్టకేలకు మండల సమావేశం ప్రశాంతంగా ముగిసింది. వైసీపీ ప్రజాప్రతినిధులు ప్రజాస్వామ్య బద్ధంగా కాకుండా తమ నామినేషన్లు చించి ఏకగ్రీవం చేసుకున్నారని, వీరికి మండల సమావేశాలకు వచ్చే అర్హత లేదని ఆరోపిస్తూ మండల సమావేశాలు జరగకుండా టీడీపీ నేతలు, కార్యకర్తలు అడ్డుకుంటున్నారు. ఇలా రెండు సార్లు సమావేశాలు జరపాలని అధికారులు తేదీలు నిర్ణయించినా టీడీపీ నేతల నిరసనతో వాయిదా పడింది. జనవరి 2న తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో మండల సమావేశం వాయిదా పడిన విషయం విదితమే. ఓ వైపు టీడీపీ... మరో వైపు వైసీపీ శ్రేణులు భారీగా మోహరించడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సభ్యులు సరైన సమయానికి రాలేదని మండల సమావేశాన్ని వాయిదా వేయడంతో వైసీపీ ప్రజాప్రతినిధులు ఎంపీడీఓ హరినారాయణపై దౌర్జన్యానికి పాల్పడి మినిట్స్ బుక్‌ను లాక్కుని నానా దుర్భాషలాడారు. దీనిపై ఎంపీడీఓ పోలీసులకు చేసిన ఫిర్యాదుపై కేసు కూడా నమోదైంది. ఈ క్రమంలో తిరిగి శుక్రవారం మండల సమావేశం నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. ఈ క్రమంలో ఇటీవల చిత్తూరు జడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడు మండల సమావేశం సజావుగా జరిపేందుకు ములకలచెరువుకు వచ్చారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డితో సమావేశమై చర్చలు జరిపారు. మండల అభివృద్ధి కోసం సమావేశానికి ఐదుగురు కూటమి నేతలను ప్రత్యేక ఆహ్వానితులుగా అనుమతి ఇచ్చారు. ఈ క్రమంలో శుక్రవారం నిర్వహించిన మండల సమావేశం ప్రశాంతంగా జరిగింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీగా మోహరించి బందోబస్తు నిర్వహించారు. మదనపల్లె డీఎస్పీ కొండయ్యనాయుడు, సీఐ లక్ష్మన్న, ఎస్ఐలు నరసింహుడు, లోకేష్‌రెడ్డి, గాయత్రి బందోబస్తును పర్యవేక్షించారు. అనుకున్న సమయానికి ప్రారంభమైన మండల సమావేశం వివిధ శాఖల మీద చర్చలతో ముగిసింది. సమావేశానికి ఎనిమిది శాఖల అధికారులు డుమ్మా కొట్టారు. సమావేశంలో ఎంపీడీఓ హరినారాయణ, ఎంపీపీ సాయిలీల, జడ్పీటీసీ మోహన్‌రెడ్డి, కూటమి నేతలు ప్రసాద్‌రెడ్డి, నరసింహారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సుదర్శన్, జయరామ్‌రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉర్దూ అకాడమీకి తూట్లు పొడిచిన వైసీపీ

- కూటమి పాలనతో రాష్ట్రంలో ప్రశాంతత
- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఎంఏ షరీఫ్

బి.కొత్తకోట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): తమ ఐదేళ్ల పాలనలో ఉర్దూ అకాడమీకి తూట్లు పొడిచి, ముస్లిం మైనారిటీల సంక్షేమాన్ని తుంగలో తొక్కిన పార్టీ వైసీపీ అని శాసనమండలి మాజీ చైర్మన్, రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ వెల్ఫేర్ సలహాదారు ఎంఏ షరీఫ్ విమర్శించారు. గురువారం కడప జిల్లా పర్యటన ముగించుకుని హార్సిలీహిల్స్‌కు చేరుకుని, గవర్నర్ బంగ్లాలో బస చేశారు. శుక్రవారం ఉదయం విలేఖరులతో ఆయన మాట్లాడుతూ ముస్లింల సంక్షేమానికి, విద్యాభివృద్ధికి, ఉర్దూ భాషా వికాసానికి సీఎం చంద్రబాబు కట్టుబడి ఉన్నారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాదులోని గచ్చిబౌలిలో 250 ఎకరాల భూమిని కేటాయించి, అప్పటి ప్రధాని వాజ్‌పేయి సహకారంతో అబుల్‌కలాం ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీని నెలకొల్పిన ఘనత చంద్రబాబుదేనన్నారు. ఉర్దూ పాఠశాలలను ఎత్తేస్తున్నారని, ఉపాధ్యాయ పోస్టులను తగ్గించేస్తున్నారని వైసీపీ పత్రికలో వస్తున్న వార్తలను ఖండిస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 12 ఉర్దూ రెసిడెన్షియల్ స్కూల్ భవనాలు, హాస్టల్ భవనాలకు రూ.30 కోట్లు నిధులిచ్చామన్నారు. ఎంఎస్‌డీపీ కింద కడప, కదిరి, గుంతకల్లు, రాయచోటి తదితర ప్రాంతాల్లో జూనియర్ కళాశాల, హాస్టల్ భవనాలను నిర్మించబోతున్నట్లు ఆయన వెల్లడించారు. బి.కొత్తకోటలో రూ.50 లక్షలతో టీడీపీ హయాంలో నిర్మించిన షాదీ మహల్‌ను వైసీపీ నేతలు ఉద్దేశపూర్వకంగా ప్రారంభించలేదన్న సమాచారంపై ఆయన స్పందిస్తూ అవసరమైన నిధులు విడుదల చేస్తామన్నారు. అంతకు ముందు పలువురు మైనార్టీ నేతలు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ కార్య నిర్వాహక కార్యదర్శి పర్వీన్‌తాజ్, అయూబ్‌బాషా పాల్గొన్నారు.


హార్సిలీహిల్స్‌లో మాట్లాడుతున్న శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్, తదితరులు

బయో రీసోర్స్ సెంటర్ ఏర్పాటుకు కృషి

కలికిరి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): కలికిరిలోని కృషి విజ్ఞాన కేంద్రంలో బయో రీసోర్స్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేస్తామని అగ్రికల్చర్ టెక్నాలజీ అప్లికేషన్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (అటారీ) జోన్-10(హైదరాబాద్) డైరెక్టర్ డాక్టర్ షేక్ ఎన్.మీరా ప్రకటించారు. కలికిరిలోని కృషి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం శాస్త్రీయ సలహా సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేరుశనగలో అడవి పందుల బెడద, ఉలవ పంట కోయడానికి హార్వెస్టర్, కొబ్బరిలో సమస్యలైన నల్లి, రుగోస్ ఫ్లై, మామిడిలో తేనె మంచుపురుగు, మిరపలో తామర పురుగులు నివారణ కోసం పరిశోధనలు ముమ్మరం చేయడానికి బయో రీసోర్స్ సెంటర్ ఉపయోగపడుతుందన్నారు. ఇదే అంశాల మీద ఆయన రైతులతో చర్చించి వారు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకున్నారు. వ్యవసాయంలో మిత్ర పురుగులు, ఆర్గానిక్ మందులు అందుబాటులోకి తేవాలని ఆయనను రైతులు కోరారు. అంతకు మునుపు కలికిరి కృషి విజ్ఞాన కేంద్రం డైరెక్టర్ డాక్టర్ కె.మంజుల 2024-25లో చేసిన వివిధ కార్యక్రమాలు, 2025-26లో చేపట్టబోయే కార్యక్రమాల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం (గుంటూరు) విస్తరణ సంచాలకులు డాక్టర్ శివనారాయణ, కలికిరి కేవీకే సహ సంచాలకుడు డాక్టర్ సుమతి, తిరుపతి వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ మహేశ్వరరెడ్డి, డాక్టర్ దేవకి, డాక్టర్ వసంత, 'రాస్' కేవీకే ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ శ్రీనివాస్, వేలూరు కేవీకే ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డా.తిరుమురుగన్, అన్నమయ్య జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ గుణశేఖర్, పీలేరు ఉద్యానశాఖాధికారి సుకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.


కలికిరిలో రైతులతో మాట్లాడుతున్న డాక్టర్ మీరా, తదితరులు

అంతరాయం లేని విద్యుత్ అందించాలి

- ఏపీ ట్రాన్స్‌కో ఎస్ఈ చంద్రశేఖరరెడ్డి

పీలేరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు అంతరాయం లేని విద్యుత్ సరఫరా అందజేయాలని ఏపీ ట్రాన్స్‌కో ఎస్ఈ చంద్రశేఖరరెడ్డి పీలేరు డివిజన్ విద్యుత్ సిబ్బందిని ఆదేశించారు. పీలేరులోని ట్రాన్స్‌కో ఈఈ కార్యాలయంలో శుక్రవారం డివిజన్ స్థాయి సమీక్షలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో లో-ఓల్టేజ్ సమస్యను అధిగమించేందుకు రెండు కొత్త సబ్-స్టేషన్లు మంజూరయ్యాయన్నారు. నాయనివారి పల్లె, వాల్మీకిపురం మండలం టి.సాకిరేవుపల్లె గ్రామాల్లో 33/11 కేవీ విద్యుత్ సబ్-స్టేషన్‌ల కోసం స్థలపరిశీలన కూడా పూర్తయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'సూర్యఘర్' పథకంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. అనంతరం డివిజన్ పరిధిలో జరుగుతున్న కార్యకలాపాలను వాకబు చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో ఈఈ చంద్రశేఖరరెడ్డి, ఏడీ అమీర్‌బాషా, జిల్లా అకౌంట్ ఆఫీసర్ బ్రహ్మయ్య ఆచారి, ఏఈలు ఖాదర్ ఇలాహీ, రామ్మూర్తి, వరప్రసాద్, ముజీబ్ పాల్గొన్నారు.

ముగిసిన ఫుట్‌బాల్ లీగ్ పోటీలు


మొదటి బహుమతిని అందజేస్తున్న సబ్‌కలెక్టర్

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా ఉన్నత పాఠశాలలో పది రోజులుగా జరుగుతున్న ఖేలో ఇండియా అస్మిత అండర్-17 బాలికల ఫుట్‌బాల్ లీగ్ పోటీలు శుక్రవారంతో ముగిశాయి. మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ మాట్లాడుతూ పట్టణంలో బాలికల విభాగంలో ఫుట్‌బాల్ పోటీలు చేయడం సంతోషంగా ఉందన్నారు. బాలికలు ఇలాంటి అవకాశాలు ఉపయోగించుకోవాలని కోరారు. ఈ రౌండ్ రాబిన్ డబుల్ లీగ్ పోటీల్లో ప్రథమ స్థానం శ్రీవేద స్కూల్ విద్యార్థులు, ద్వితీయ స్థానం వశిష్ఠ పాఠశాల విద్యార్థులు కైవసం చేసుకున్నారు. మొదటి, రెండోవ స్థానాలలో నిలిచిన పాఠశాలలకు రూ.50 వేలు, 30 వేలు చెక్కులను క్రీడాకారులకు అందించారు.

అధ్వానంగా.. ఐసీయూ

- కాలం చెల్లిన పరికరాలు,
- విరిగిపోయిన మంచాలు, చిరిగిపోయిన బెడ్లు
- అందుబాటులో లేని ఆక్సిజన్ సిలిండర్లు
- అటకెక్కిన సెంట్రల్ ఏసీ ● కరెంటు సరఫరా అంతంతే..
- ఇదీ ఘనత వహించిన రిమ్స్‌లో దుస్థితి

ఐసీయూ (ఇంటెన్సివ్ కేర్ యూనిట్) అంటే.. అత్యవసర విభాగం.. ఇక్కడ చేర్చే రోగులు తీవ్రస్థాయి అనారోగ్యంతో ఉంటారు. వీరికి సరైన సమయంలో సక్రమంగా వైద్యం అందించాల్సి ఉంటుంది. ఇక్కడ ఏ మాత్రం ఏమరపాటుగా ఉన్నా.. రోగులకు అందించే వైద్యంలో తేడా వచ్చినా క్షణాల్లో వారి ప్రాణాలు ఇట్టే గాలిలో కలిసి పోతాయి. అయి తే ఇంతటి ప్రాధాన్యత ఉన్న ఐసీయూ సరైన వైద్య సేవలు అందిం చలేక అరకొర వసతులతో ప్రాణాపాయ స్థితిలో కొట్టు మిట్టాడు తోంది. ఇది ఎక్కడో మారుమూల ఆసుపత్రిలో కాదు. ఇది ఘనత వహించిన ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో నెలకొన్న దుస్థితి.



కడప సెవెన్ రోడ్స్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కడప నగర పరిధిలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో దాదాపు 900 పడకలతో రోగులకు వైద్యసేవలను అందిస్తున్నారు. ప్రతిరోజు సుమారు 1200 నుంచి 1500 వరకు ఓపీ కొనసాగుతోంది. వైద్యం కోసం వచ్చే రోగుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. అయితే ఆసుపత్రి ప్రారంభంలో ఐసీయూ 20+20 పడకలతో మొదలు కాగా.. ఇప్పటికీ అలాగే కొనసాగుతోంది. అవే పరికరాలు, పాడై పోయిన బెడ్లపై అరకొర వసతులతో వైద్యం అందిస్తూ కాలం గడుపుతున్నారు.



పరదాలు లేని ఐసీయూలో వైద్య సేవలు



విరిగిన మంచానికి కట్లు



ఆక్సిజన్ అందించే గేజ్ మిషన్ల పరిస్థితి

అరకొర వసతులతో వైద్య సేవలు

ఐసీయూలో పూర్తిస్థాయి వైద్య పరికరాలతో పాటు ఆక్సిజన్ తప్పక అందుబాటులో ఉండాలి. ఇక వెంటిలేటర్ మిషన్లలో కొన్ని రకాల పరికరాల పని సామర్థ్యానికి ఎయిర్ కండిషన్ కూడా చాలా కీలకం. అయితే ప్రభుత్వ సరస్వజన ఆసుపత్రిలో సెంట్రల్ ఎయిర్ కండీషన్ సిస్టం పనిచేయడం లేదు. ప్రత్యామ్నయంగా రూంలో వాడే ఐసీలు, టేబుల్ ఫ్యాన్‌లతో వైద్య సేవలను అందిస్తున్నారు. సెంట్రల్ ఏసీ కాస్త అటకెక్కింది. కరెంటు సరఫరా సైతం ఐసీయూలో ఇబ్బంది పెడుతూనే ఉంటుంది. ఇక కాలం చెల్లిన, విరిగిన మంచాలపైన వైద్య సేవలను అందిస్తున్నారు. సెంట్రల్ ఆక్సిజన్ సరఫరా అందుబాటులో ఉన్నప్పటికి గేజ్ మిషన్లు పనితీరు అంతంత మాత్రమే. ఆక్సిజన్ లీకేజీల వల్ల ఏదైనా అగ్నిప్రమాదం సంభవిస్తే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుంది.



ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం

ఆసుపత్రిలో కొన్ని సౌకర్యాల కల్పనకు, బెడ్ల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. సెంట్రల్ ఏసీ మరమ్మత్తులు వచ్చినపుడు రోగులకు ఇబ్బంది లేకుండా ఏసీ మిషన్లు, ఫ్యాన్లు అమర్చాం. ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదనలు ఆమోదం పొందితే మరింత మెరుగ్గా రోగులకు సౌకర్యాలు అందిస్తాం. ఐసీయూను నిరంతరం పర్యవేక్షిస్తుంటాం. రోగులకు ఇబ్బంది లేకుండా చూస్తున్నాం.

-డాక్టర్ శ్రీనివాసులు సీఎస్ఆర్ఎంఓ, సర్వజన ఆసుపత్రి, కడప

రోగుల అవస్థలు వర్ణనాతీతం

ఐసీయూలో కిటికీలకు పరదాలు కరువయ్యాయి. బెడ్డు మీద వైద్యం చేయించుకుంటున్న రోగులు బాహాటంగా అందరికి కనిపిస్తున్నారు. ముఖ్యంగా మహిళా రోగులు ఉన్న బెడ్ల వద్ద ఉన్న కిటికీలకు కూడా కర్టెన్లు లేకపోవడంతో వైద్యం పొందే సమయంలో తీవ్ర అసౌకర్యానికి గురవతున్నారు. కొన్నిచోట్ల కిటికీలకు అడ్డంగా అట్టలను ఉంచి కవర్ చేస్తున్నారు. రోగులు బాత్‌రూం వెళ్లేందుకు వీల్‌చెయిర్‌ల కోసం గంటల తరబడి వేచి చూ డాల్సిన పరిస్థితి. ఇప్పటికైనా జిల్లా అధికారులు చర్యలు చేప ట్టి అత్యవసర వైద్య సేవల విభాగాల్లో అన్ని వసతులు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

హుండీల లెక్కింపుతో గండికి రూ. 17లక్షల ఆదాయం



గండి క్షేత్రంలో హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

చక్రాయపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): గండి వీరాంజనేయస్వామి దేవస్థానంలో శుక్రవారం సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో హుండీల లెక్కింపు కార్యక్రమం జరిగింది. ఈ హుండీల లెక్కింపుతో రూ.17,00,750 ఆదాయం వచ్చింది. అలాగే నిత్య అన్నదాన ప్రసాదం హుండీ ద్వారా రూ.30 వేలు, నాలుగు గ్రాముల బంగారు, 320 గ్రాముల వెండి, రెండు డాలర్లు వచ్చాయి. 80 రోజుల హుండీల లెక్కింపు శుక్రవారం జరిగింది. జిల్లా దేవదాయశాఖ జూనియర్ అసిస్టెంట్ భారతి, ప్రధాన అర్చకులు కేసరి, ఉప ప్రధాన అర్చకులు రాజారమేష్, దేవస్థాన చైర్మన్ కావలి కృష్ణతేజ, మాజీచైర్మన్ వెంకటస్వామి, ఏపీజీబీ మేనేజర్ భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండోలో మెరిసిన ముత్యాలు

- రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ



పతకాలు సాధించిన చిన్నారులు

ప్రొద్దుటూరు రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో జరిగిన ఎన్టీఆర్ మెమోరియల్ తైక్వాండో చాంపియన్ షిప్-2025 పోటీల్లో కడప జిల్లా విద్యార్థులు పతకాల పంట పండించారు. జనవరి 30 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు జరిగిన తైక్వాండో రాష్ట్రస్థాయి పోటీల్లో అద్భుత ప్రదర్శనతో మొత్తం 17 పతకాలు సాధించి ఓవరాల్ రన్నరప్‌గా నిలిచి ప్రతిభను చాటారు. ఈ పోటీల్లో మొత్తం 9 స్వర్ణ పతకాలు, 4 రజిత, 4 కాంస్య పత కాలు సాధిం చినట్లు కోచ్‌లు కమాల్, రాజేష్‌లు తెలిపారు. మహిత, సత్య భామ, ఏస్వరి, హోషిక, కీర్తన, విజయసుందరరాజు, దినేష్, హేమ, తనిష్‌లు స్వర్ణపతకాలు సాధించగా, వెంటక మోక్షిత, నిహాల్, తేజస్వీ, త్రివేణిలు కాంస్య పతకాలను, మహర్నిష్, యోగి విశ్వనాధరెడ్డి, భరత్, ఫరియాలు రజిత పతకాలను సాధించినట్లు వివరించారు.

మన మిత్ర ద్వారా హాల్ టికెట్లు

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు సంబంధించి సెకండియర్ ఎంపీసీ, బైపీసీ చదువుతున్న విద్యార్థులు ప్రాక్టికల్ హాల్ టికెట్స్‌ను కాలేజ్ లాగిన్ పబ్లిక్ డొమైన్ హెచ్‌టీటీపీఎస్://బీఐఈ.ఏపీ.జీఓవి.ఇన్‌లో అందుబాటులో ఉన్నట్లు ఆర్ఐఓ వెంకటసుబ్బయ్య తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన మనమిత్ర (వాట్సప్ గవర్నెన్స్) ద్వారా 9552300009 అనే నెంబర్‌కు హాయ్ అనే మెసేజ్ పంపించి.. అందులో ఎడ్యుకేషన్ సర్వీసెస్ ఆప్షన్ ఉపయోగించి ప్రీవియస్ హాల్ టికెట్ నెంబర్ లేదా ఆధార్ నెంబర్, పుట్టిన తేదీలను ఎంటర్ చేసి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో ఇటుకల బట్టీ కార్మికుడి మృతి



ఆసుపత్రిలో స్ట్రెచర్‌పై ఉన్న బ్రహ్మం మృతదేహం

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండలం రామేశ్వరంలోని ఇటుకల బట్టీలో పనిచేసే బ్రహ్మం (30) అనే కార్మికుడు శుక్రవారం అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. బ్రహ్మం తల్లి సంధ్యావతి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.... దొరసానిపల్లెలో నివాసముంటున్న సంధ్యావతి, శివ శంకర్‌లకు ముగ్గురు సంతానం. పెద్ద కుమారుడైన బ్రహ్మం గత ఐదేళ్లుగా రామేశ్వరంలోని నలగట్ల శ్రీనివాసులరెడ్డి అలియాస్ బెంగుళూరు శ్రీనుకు చెందిన సిమెంటు ఇటుకల ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. సూమారు రెండేళ్ల క్రితం బ్రహ్మం నాగలక్ష్మి అనే ముగ్గురు పిల్లలు గల వివాహితను ప్రేమ వివాహం చేసుకున్నాడు. అదే ఇటుకల బట్టీలో యజమాని శ్రీనివాసులరెడ్డి ఇచ్చిన రేకుల గదిలో నివాసముంటున్నారు. వివాహం చేసుకున్నప్పటి నుంచి బ్రహ్మం తల్లిదండ్రుల వద్దకు వెళ్లలేదు. వివాహం అయిన రెండు రోజు లకు తల్లిదండ్రులు వెళ్లి కుమారుడితో మాట్లాడటానికి ప్రయ త్నించగా బట్టి యజమాని మీ కుమారుడు వివాహం చేసుకొని మా బట్టిలోనే బతుకుతున్నాడు. అతడి బాధ్యత నాదేనని.. తల్లిదండ్రులకు చెప్పి పంపించాడు. అయితే శుక్రవారం ఉదయం 10.30 గంటలకు మీ కొడుకు ఫ్యానుకు ఉరి వేసుకున్నాడని తల్లిదండ్రులకు శ్రీనివాసులరెడ్డి ఫోన్ చేశాడు. అప్పటికే మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడకు తల్లిదండ్రులు వెళ్లి చూడగా బ్రహ్మం విగత జీవిగా స్ట్రెచర్ మీద వున్నాడు. ఇటుకల బట్టీలో ఉరి వేసుకుంటే పోలీసులకు ఫోన్ చేయకుండా నేరుగా జిల్లా ఆసుపత్రికి ఎందుకు తీసుకొచ్చారని బ్రహ్మం తల్లి సంధ్యావతి ప్రశ్నించారు. బ్రహ్మం మృతికి అతని భార్య నాగలక్ష్మి, ఇటుకల బట్టి యజయానిపై అనుమానం ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతదేహంపై ఉరివేసుకున్నట్లు గొంతుపై ఎలాంటి ఆనవాళ్లు కనిపించలేదని.. పోలీసులు తమ కుమారుడి మరణంపై పూర్తిస్థాయిలో విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు.

బంగారు గొలుసు అపహరణ



బాధితురాలి నుంచి వివరాలు సేకరిస్తున్న సీఐ, ఎస్ఐ

వల్లూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆదినిమ్మాయపల్లె డ్యాంకు వెళ్లే రహదారిలో కొత్తపల్లె చెరువు వద్ద శుక్రవారం ఉదయం మహిళమెడలోని గొలుసును దుండగుడు లాక్కెళ్లినట్లు వల్లూరు సీఐ రోషన్ తెలిపారు. సి.కొత్తపల్లెకు చెందిన కాంతమ్మ తన పశువులను చెరువు వద్ద మేపుకుంటుండగా దుండగుడు ద్విచక్రవాహనంపై వచ్చి లాక్కెళ్లినట్లు వెల్లడించారు. రెప్పపాటులో జరిగిన ఆ సంఘటన చూసి బిత్తర పోయిన కాంతమ్మ కేకలు వేయగా అగంతకుడు తన ద్విచక్రవాహనంలో ఆదినిమ్మాయపల్లె వైపు వెళ్లిపాయాడు. ఈమేరకు ఆమె తన బంధువులను స్టేషన్‌కు రావడంతో అక్కడున్న పోలీసులు దుండగుడి కోసం ఆరా తీస్తున్నారు. ఈ విషయం తన దృష్టికి రావడంతో ఇన్‌చార్జ్ ఎస్.ఐ. ప్రతాప్‌రెడ్డితో కలిసి సంఘటనా స్థలికి వెళ్లి పరిశీలించామన్నారు. సిబ్బందిని అప్రమత్తం చేసి అన్ని రూట్లకు పంపించినట్లు తెలిపారు. కాగా దుండగుడి వివరాలను ఎర్రపల్సర్ బండి, ఎరుపు రంగు టీ.షర్ట్, మూతికి మాస్క్ ధరించారని బాధితురాలు తెలిపారు. కేసును దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రోషన్ వెల్లడించారు.

మామపై అల్లుడు దాడి

కడప(క్రైం), ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కడప నగరం భగత్ సింగ్‌నగర్‌లో శుక్రవారం మామపై అల్లుడు దాడి చేసినట్లు తాలుకా ఎస్ఐ తాహీర్ హుస్సేన్ తెలిపారు. పఠాన్ మగ్బూల్ బాష, అతడి అల్లుడు షారుక్‌ఖాన్‌ల మధ్య కుటుంబ తగదాలు నెలకొన్నాయి. దీంతో అల్లుడు మామను దాడి చేసి గాయపరిచినట్లు తెలిపారు. భాదితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

పీఎఫ్ ఖాతాను ఆన్‌లైన్ చేయాలి

- జడ్పీ సీఈఓకు యూటీఎఫ్ వినతి



సీఈఓ ఓబుళమ్మకు వినతిపత్రం సమర్పిస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలకు సంబంధించి 2023-24, 2024-25 వార్షిక జమలను వెంటనే ఆన్‌లైన్ చేయాలని యూటీఎఫ్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో ముఖ్య కార్య నిర్వహణ అధికారి సి.ఓబుళమ్మను కలిసి యూటీఎఫ్ జిల్లా శాఖ పక్షాన వినతిపత్రం సమర్పించారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్‌బాబులు మాట్లాడుతూ జిల్లాలోని మండల పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులు తమ జీతభత్యాల నుంచి కొంత సొమ్మును ప్రతినెల ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలకు పొదుపు కింద జమచేస్తున్నారన్నారు. 2022-23 వరకు మాత్రమే ఆన్‌లైన్ చేశారని, ఇప్పటి వరకు ఆన్‌లైన్ చేయలేదన్నారు. కావున చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వై.రవికుమార్, కె.రసింహరావు, రూతు ఆరోగ్యమేరీ, చంద్రశేఖర్, గోపీనాథ్, మేరీ ప్రసన్న, రామకేశవ, వీరనారాయణ ఉన్నారు.

ఘనంగా ఉరుసు మహోత్సవాలు



వాల్మీకిపురం ఉరుసు ఉత్సవాలకు హాజరైన మైనార్టీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారుడు ఎంఏ షరీఫ్

వాల్మీకిపురం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): హసన్‌ఖాన్ వీధిలో జూటహజ్రత్‌ఖ్వాజా పీర్ మస్తాన్‌వలి దర్గాలో శుక్రవారం ఉరుసు మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం దర్గాలో గంధం, ముషాయిరా నిర్వహించారు. మరో రెండు రోజులు ఉరుసు, ఖవ్వాలి, తహలీల్‌ఫాతేహా జరగనున్నాయి. తొలిరోజు ఉరుసు మహోత్స వాల్లో రాష్ట్ర మైనార్టీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారుడు ఎంఏ షరీఫ్, ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి చాదర్ సమర్పించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్ర మంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కంభం నిరంజన్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, ఉపాధ్యక్షుడు బొక్కసం రామకృష్ణ, నాయకులు పీవీ నారాయణ, చంద్రమౌళి, మురళి, కువైట్ సయ్యద్‌బాషా, డిష్ బ్రదర్స్, దర్గా కమిటీ అధ్యక్షు డు సయ్యద్ బాషా, మైనార్టీ నేతలు, మతపెద్దలు, యువత పాల్గొన్నారు.

సన్నబియ్యం అందిస్తే హాజరు పెరుగుదల

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకంలో సన్నబియ్యంతో కూడిన పౌష్టికాహారాన్ని అందించడం వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో హాజరుశాతం పెరుగుతుందని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యాహ్న భోజన పథకంతో పాటు సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు సన్నబియ్యాన్ని అందించాలని మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోవడం హర్షణీయమన్నారు.

విద్యార్థుల హాజరుశాతం పెంచడంతో పాటు విద్యాభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు సహేతుకంగా ఉన్నాయన్నారు. వీటితో పాటు విద్యా వ్యవస్థకు అడ్డంకిగా మారిన 117 జీఓను సమూలంగా రద్దు చేసి విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తిని కూడా తగ్గించి ఒక్క ఉపాధ్యాయ పోస్టు కూడా పోకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

హోటళ్లపై విజిలెన్స్ దాడులు

- 15 సిలిండర్లు స్వాధీనం



పట్టుబడిన గ్యాస్ సిలిండర్లతో విజిలెన్స్ అధికారులు

కడప(క్రైం)ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కమాలాపురం, ఎర్రగుంట్ల ప్రాంతాలలో శుక్రవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించి 15 సిలిండర్లను సీజ్ చేసినట్లు డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ గీతావాణి తెలిపారు. గృహాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్లను హోటళ్లకు వినియోగిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడులు చేశామని తెలిపారు. వంట గ్యాస్‌ను వాణిజ్య కార్యకలాపాలకు వినియోగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

క్రమశిక్షణ, పట్టుదలతో చదవాలి

వేంపల్లె, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే ఎలాంటి పరీక్షలోనైనా విజయం సాధ్యమవుతుందని బాంబే ఐఐటీలో చదివిన అయ్యపుపని వంశీనాథ్ తెలిపారు. సాఫ్ట్‌వేర్ కంపెనీలో కోటి రూపాయల ఉద్యోగాన్ని వదులుకొని యూపీఎస్సీ ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షకు ప్రిపేర్ అవుతున్న వంశీనాధ్ ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్త ఇక్కడి విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందని, తన కుమారుడు వంశీనాధ్‌తో విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు ఇప్పించారు. ఈ సందర్భంగా వంశీనాధ్ మాట్లాడుతూ ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు నిరంతరం శ్రమించాలన్నారు. కార్యక్రమంలో ట్రిపుల్‌ఐటీ అకడమిక్ డీన్, సీఎస్ఈ హెచ్ఓడీ రత్నకుమారి, ఏఓ రవికుమార్, డీన్ రమేష్, ప్లేస్‌మెంట్ అధికారి సుందర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఉద్యాన విద్యార్థుల సాంస్కృతిక, క్రీడా పోటీలు

- ఓవరాల్ చాంపియన్‌గా అనంతరాజుపేట కళాశాల



ఓవరావల్ చాంపియన్ సాధించిన విద్యార్థులు

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతరాజు పేట ఉద్యాన కళాశాల ఆవరణలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న ఉద్యాన అంతర కళాశాలల రాష్ట్ర స్థాయి సాంస్కృతిక, క్రీడా పో టీలు శుక్రవారం ముగిశాయి. ఈ పోటీల్లో 9 కళాశాలలకు చెందిన 450 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో నువ్వా నేనా అన్నట్లుగా విద్యార్థులు పోటీ పడి అన్ని క్రీడులు ఆడారు. హోరాహోరీగా సాగిన పోటీల్లో అనంతరాజుపేట ఉద్యాన విద్యార్థులు అన్ని అంశాల్లో అదరగొట్టారు. సాంస్కృతిక, సాహిత్య, క్రీడా పోటీల్లో ఓవరాల్ చాంపి యన్‌గా నిలిచారు. విజేతలకు ఉద్యాన యూనివర్శిటీ ఉపకులపతి కే.గోపాల్ బహుమతులు అందించి అభినందించారు. అనంతరాజుపేట కళాశాల ఉద్యో గులు, అధ్యాపకులను అభినందించారు. ముగింపు కార్యక్రమంలో డీఎస్‌ఏ డాక్టర్ సూర్యకుమారి, డీఈ గోవిందరాజులు, అసోసియేట్ డీన్ పీటీ శ్రీనివాస్, ఓఎస్‌ఏ డాక్టర్ సయ్యద్ సదరున్నీసాలు ప్రసంగించారు. అనంతరం ఉపకులపతి గోపాల్‌ను ఘనంగా సన్మానించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాజంపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సబ్‌స్టేషన్‌ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం రాజంపేట పట్టణం చుట్టుపక్కల ప్రాంతాల్లో కరెంటు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏపీ ఎస్పీడీసీఎల్ డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఎం.సురేంద్రనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. రాజంపేట పట్టణంతో పాటు బోయనపల్లె, ఆకేపాడు, చెర్లోపల్లె, కట్టకిందపల్లె, తాళ్లపాక సబ్‌స్టేషన్ల పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. కావున వినియోగదారులు విద్యుత్ అధికారులకు సహకరించాలని కోరారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

సిద్దవటం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కనుమలోపల్లె వద్ద ఉన్న ఆలయంలో శుక్రవారం కామాక్షి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. మండల ఇన్‌చార్జి తహసీల్దారు మాధవీలత కార్యక్రమంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తలనీలాల వేలం వాయిదా

సిద్దవటం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నిత్యపూజేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా తలనీలాలు సేకరించుకునే హక్కులకు శనివారం నిర్వహించాల్సిన వేలం అనివార్య కారణాల వల్ల వాయిదా పడినట్లు ఈవో మోహన్ రెడ్డి తెలిపారు. ఈ నెల 13న నిర్వహించనున్నట్లు వివరించారు.

'బీసీలు ఇప్పుడు గుర్తుకొచ్చారా?'

రాయచోటిటౌన్, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): బీసీలపై దాడులు చేయడం అన్యాయమని మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి మాట్లాడడం విచిత్రంగా ఉందని ఉభయ తెలుగు రాష్ట్రాల డ్రైవర్ల అసోసియేషన్ అధ్యక్షుడు ఉసిరికాయల సిద్దార్థగౌడ్ ఎద్దేవా చేశారు. శుక్రవారం ఆయన రాయచోటి పట్టణంలోని అంబేడ్కర్ ఫ్లెక్సీ వద్ద మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఎంతో మంది బీసీలపై దాడులు చేయడమే కాకుండా అక్రమ కేసులు పెట్టి అన్యాయంగా జైలుపాలు చేశారని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలపై దౌర్జన్యాలకు, దాడులకు పాల్పడిన మీకు బీసీల సంక్షేమంపై మాట్లాడే అర్హత లేదన్నారు.

దుస్థితిలో జగనన్న కాలనీ..

● కొండగుట్టల్లో ఇళ్లు ● సీసీ రోడ్లు లేక అవస్థలు



మాధవరంలోని జగనన్న కాలనీ (ఇన్‌సర్ట్) కాలనీలో పెరిగిపోయిన పిచ్చిమొక్కలు

సిద్దవటం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జగనన్న కాలనీల్లో రోడ్లు పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్నాయి. 2021లో వైసీపీ ప్రభుత్వం హయాంలో మండలానికి 652 పక్కా గృహాలు మంజూరయ్యాయి. మాధవరం, సిద్దవటం, కడపాయపల్లె, ఉప్పరపల్లె తదితర ప్రాంతాల్లోని కొండల్లో, గుట్టల్లో వన్యప్రాణులు సంచరించే ప్రాంతాల్లో ఆయా గృహాలకు ప్రభుత్వం స్థలాలు కేటాయించింది. ఆయా ప్రాంతాల్లో కొంతమంది ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకున్నా అధిక శాతం లబ్ధిదారులు నిర్మాణపనులను అర్ధాంతరంగానే నిలిపివేశారు. ఆయా కాలనీల్లో సీసీ రోడ్లు సైతం వేయకపోవడంతో నిర్మాణాలు పూర్తి చేసినవారు సైతం నివాసం ఉండేందుకు ఇష్టపడడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి హౌసింగ్ కాలనీలో సీసీ రోడ్లు నిర్మించాలని కాలనీ వాసులు కోరుతున్నారు. ఈ విషయంపై హౌసింగ్ ఏఈ చెన్నయ్య మాట్లాడుతూ మండలంలో ఉన్న హౌసింగ్ కాలనీల్లో సీసీ రోడ్ల ఏర్పాటుపై ఉన్నతాధికారులకు నివేదిక పంపించామని, మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామని తెలియజేశారు.

ఈ క్రాప్ నమోదు తప్పనిసరి: జేసీ



జేసీ ఆదర్శరాజేంద్రన్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పంట సాగు చేసిన ప్రతి రైతు తప్పనిసరిగా ఈ క్రాప్ బుకింగ్ చేయించాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ సూచించారు. శుక్రవారం మండలంలోని కోనంపేట, దిన్నెపాడు, బి ఎర్రగుడి గ్రామాల్లో పర్యటించి ఈ క్రాప్ బుకింగ్ వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుసేవా కేంద్ర సిబ్బంది ఆన్ లైన్ లో నమోదు చేసిన పంట అనంతరం మాట్లాడుతూ ప్రతి రైతు మొబైల్లో ఎన్‌పీఎస్ఎస్ యాప్‌ను తప్పని సరిగా డౌన్‌లోడ్ చేయించాలని ఆర్బీకే సిబ్బందిని ఆదేశించారు. రైతులు సాగుచేసిన పంట వివరాలు ముందుగా నోట్ చేసుకొని పంట పూర్తి అయ్యేంతవరకు రైతులకు సూచనలు సలహాలు ఇవ్వాలన్నారు. వ్యవసాయ క్షేత్రస్థాయి సిబ్బంది రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఈకేవైసీ 100 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. రీ సర్వే సక్రమంగా నిర్వహించాలని ప్రతి రైతుకు సరైన హద్దులు చూపించాలన్నారు. రీసర్వేకు మూడు రోజుల ముందు రైతులకు నోటీసులు జారీచేసి రైతు కుటుంబీకులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. జేడీఏ చంద్రానాయక్, తహసీల్దార్ శ్రీనివాసులు, ఏడీఏ జయరాణి, ఏవో రమేష్‌బాబురావు, డీటీ హరిప్రసాదు, మండల సర్వేయర్ మదన్‌మోహన్ రెడ్డి, ఎంఆర్‌ఐ రాజేష్, రైతు భరోసా కేంద్రం సిబ్బంది, ఉద్యానవనశాఖ సిబ్బంది పాల్గొన్నారు

హిందూ మనోభావాలను పరిరక్షించాలి

హిందువుల మనోభావాలను పరిరక్షించాలని బీజేపీ జిల్లా కార్యదర్శి ఆనంద్ గజపతిరాజు, మండల బీజేపీ అధ్యక్షుడు కొండూరు వెంకటరామరాజు శుక్రవారం లక్కిరెడ్డిపలెలో జేసీ ఆదర్శ రాజేంద్రన్‌కు వినతి పత్రం అందజేశారు. హిందువుల నివాసాలు ఎక్కువగా ఉండే కుర్నూతల బ్యాంక్ ప్రాంతంలో ఓ వర్గం వారు ఎలాంటి అనుమతులు లేకుండా ప్రార్థన మందిరాన్ని నిర్మించి స్థానికులను ఇబ్బందులు పెడుతున్నారని ఫిర్యాదు చేశారు. ఈ ప్రార్థన మందిర నిర్మాణం ప్రారంభం నుంచి స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, స్థానికులతో పాటు రాష్ట్రేతర వ్యక్తుల సంచారం, కార్యకలాపాలు ఆందోళన కలిగిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. హిందూ ధర్మ పరిరక్షణ కమిటీ సభ్యులు వీరారెడ్డి, సురేష్, నరసింహులు, శివ, ఉష, సుభాషిణి, ఉమ తదితరులు పాల్గొన్నారు.

మూడవ అదనపు జిల్లా జడ్జిగా ప్రవీణ్‌కుమార్



న్యాయమూర్తి ప్రవీణ్ కుమార్‌ను సత్కరిస్తున్న న్యాయవాదులు

రాజంపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట మూడవ అదనపు జిల్లా జడ్జిగా ప్రవీణ్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక న్యాయవాదులతో కోర్టుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ రాజంపేట ప్రాంతంలో కక్షిదారులకు సత్వర న్యాయం అందించడానికి అన్ని విధాలా కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా న్యాయవాదులు ఆయనను ఘనంగా సత్కరిం చారు. ఈ కార్య క్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాసరుద్దీన్, న్యాయవాదులు సుదర్శన్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, జానీ, కృష్ణకుమార్, రామచంద్రనాయుడు, కరుణాకర్‌రాజు పాల్గొన్నారు.

సీఎస్ఆర్ నిధులతో పాఠశాలకు డెస్కులు



డెస్కులను ప్రారంభిస్తున్న ఎంఈవో సుబ్బరాయుడు

రాజంపేట టౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ పథకం కింద ఐడీబీఐ అధికారులు రాజంపేట పట్టణంలోని మన్నూరు ఉన్నత పాఠశాలకు రూ. 1.25 లక్షలు విలువ చేసే 22 డెస్కులను అందజేశారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారి-2 సుబ్బరాయుడు మాట్లాడుతూ విద్యార్థుల కోసం ఐడీబీఐ బ్రాంచ్ మేనేజర్ సత్యనారాయణ డెస్కులు మంజూరు చేశారనారు. ఇతర బ్రాంచ్ మేనేజర్ వాసు, ప్రధానోపాధ్యాయురాలు కొండూరు పరిమళ బ్యాంకు సిబ్బంది వినోద్, సుబ్రమణ్యం, విద్యాకమిటీ చైర్మన్ నాగ రాజు తదితరులు పాల్గొన్నారు.

వెట్టిచాకిరీని నిర్మూలించాలి

ఓబులవారిపల్లి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 23 బలవంతపు శ్రమను నిషేధిస్తుందని రైల్వేకోడూరు జడ్జి సాయితేజ అన్నారు వెట్టి చాకిరీ నిర్మూలన దినోత్సవం సందర్భంగా మండలంలోని మంగంపేట ఏపీఎండీసీ ఆవరణలో మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెట్టిచాకిరి నిర్మూలనకు ప్రతిఒక్కరు తమ వంతుగా ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీవో సుదర్శన్ రెడ్డి, సీనియర్ న్యాయవాదులు వెంకటరామరాజు, శంకరయ్య, ఏజీపీ చిట్టిబాబు, ఎస్ఐ మహేష్, ఎస్పీఎఫ్ ఎస్ఐ శివ, ఏపీఎండీసీ ఉద్యోగులు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

మండలానికి చేరిన ప్రీ ప్రైమరీ ప్రశ్నపత్రాలు

పెనగలూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 8 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, 3 ప్రైవేటు ఉన్నత పాఠశాలల్లో ఈ నెల 10న జరగనున్న ప్రీ ప్రైమరీ ప్రశ్నపత్రాలు శుక్రవారం ఎంఈవో కార్యాలయానికి చేరుకున్నాయి. రెగ్యులర్ పబ్లిక్ పరీక్షల లాగానే ఈ పరీక్షలు కూడా ఉదయం 9.30 గంటల నుంచి 12.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు ఎంఈవో-1 గిరివరదయ్య, ఎంఈవో-2 టి.నాగసుబ్బరాయుడు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉచితంగా, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు రుసుం చెల్లించి ప్రశ్నపత్రాలు పొందవచ్చన్నారు. ఏ రోజు జరిగే పరీక్ష ప్రశ్న పత్రాలు ఆ రోజు మాత్రమే ఇవ్వనున్నట్లు తెలిపారు.

రేపు వైద్య, రక్తదాన శిబిరం

నందలూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : ఆల్ హాది వెల్ఫేర్ హ్యూమన్ రైట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కువైట్ ప్రవాస నందలూరు యూత్ వారి సహకారంతో ఈనెల 9న స్థానిక బస్టాండు సమీపంలోని వైఎస్ఆర్ విగ్రహం వద్ద , వైద్య ,రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఆ సంస్థ చైర్మన్ మహ్మద్ ఇబ్రహీం, అన్నమయ్య జిల్లా ప్రెసిడెంట్ సయ్యద్‌నజీర్, సలహాదారు షేక్ కరీముల్లా తెలిపారు. కడపకు చెందిన కీళ్ల వైద్యుడు డాక్టర్ జహంగీర్, కంటివైద్యుడు డాక్టర్ ఆసిఫ్, చిన్నపిల్లల స్పెషలిస్ట్ సయ్యద్ ఫరూక్, హుస్సేన్, మధుమేహ సమస్యలకు డాక్టర్ జయభాస్కర్‌రావు, కిడ్నీ సంబంధిత వైద్యుడు డాక్టర్ సతీష్‌రెడ్డి, ఎండీ జనరల్ డాక్టర్ రబ్బాని పర్యవేక్షణలో వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తామన్నారు. వైద్యుల సూచన మేరకు ఈసీజీ వంటి పరీక్షలు కూడా ఉచితంగా చేస్తామన్నారు.

రాజముద్రలో ఉర్దూకు చోటు కల్పించాలి



ఎంపీ షరీఫ్‌కు వినతిపత్రం అందజేస్తున్న రాయచోటి ముస్లిం నేతలు

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో లాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజముద్రలో కూడా రెండవ అధికార భాషగా ఉర్దూ భాషకు చోటు కల్పించాలని సహారా వెల్ఫేర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి షేక్. అఫ్తాబ్ ఆధ్వర్యంలో రాయచోటి మైనార్టీలు రాష్ట్ర మైనార్టీ వ్యవహారాల ముఖ్య సలహాదారు ఎంఏ షరీఫ్‌కు విన్నవించారు. గురువారం ఆయన రాయచోటికి వచ్చిన సందర్భంగా స్టేట్‌గెస్ట్ హౌస్‌లో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర ఉద్యమంలో ఉర్దూ సాహిత్యం ఎంతో మందిని ప్రేరేపించిందని వారు గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అధి కార కార్యకలాపాలు, ఉత్తర, ప్రత్యుత్తరాలను తెలుగుతో పాటు ఉర్దూలోనూ కొనసాగించేలా సమాన హోదా కల్పించేలా తమ విన్నపాన్ని రాష్ట్ర ముఖ్య మంత్రి నారాచంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్ర మంలో సహారా వెల్ఫేర్ సొసైటీ సభ్యులు జిలాన్‌బాషా, కార్యదర్శి ఇలియాస్‌బేగ్, అప్జల్, సగీర్, జంజం జమీల్, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల మాస పత్రిక ఆవిష్కరణ

పుల్లంపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని దళవాయిపల్లె ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు రమణ 'మా బడిలో మేము' అనే పేరుతో తయారు చేసిన మాస పత్రికను శుక్రవారం ఎంఈవో చక్రధర్‌రాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఒక నెలలో జరిగిన అంశాలను మాసపత్రిక ద్వారా అందరికీ తెలియజేయడం జిల్లాలో ఇదే మొదటిసారి అన్నారు. మాస పత్రికలో విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులు, గీసిన బొమ్మలు, రాసిన కథలు, కవితలు, పజిల్స్ వంటివి ప్రచురించడం విద్యార్థుల్లో సృజనాత్మక ధోరణి పెంచేందుకు ఎంతో ఉపయుక్తమన్నారు.దీనివల్ల విద్యార్థులకు పాఠశాల పట్ల పాఠ్యాంశాలపై మక్కువ పెరుగుతుందని ఉపాధ్యాయులు వివరించారు.

ఎస్ఐ దౌర్జన్యాల నుంచి రక్షణ కల్పించండి

● ఎస్పీ విద్యాసాగర్ నాయుడుకు ప్రజా సంఘాల నేతల వినతి



మాట్లాడుతున్న విశ్వనాథ్, రెడ్డిశేఖర్, నాగేంద్రనాయక్

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని సుండుపల్లె మండల ఎస్ఐ శ్రీనివాసులు దౌర్జన్యాల నుంచి గిరిజన నాయకులకు రక్షణ కల్పించాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ అన్న మయ్య జిల్లా నాయకుడు రెడ్డిశేఖర్, ఏపీ బంజారా సంఘం జాతీయ అధ్యక్షులు నాగేంద్రనాయక్, చౌహాన్ ఎస్పీ విద్యాసాగర్ నాయుడుకు విన్నవించారు. శుక్రవారం వారు ఎస్పీని కలిసి సుండుపల్లె ఎస్ఐ శ్రీనివాసులు దౌర్జన్యాలపై ఫిర్యాదు చేశారు. అనంతరం మాట్లాడుతూ సుండుపల్లె ఎస్ఐ శ్రీనివాసులు దౌర్జన్యాలకు, అవినీతి అక్రమా లకు అడ్డూ అదుపు లేకుండా పోయిందన్నారు. కొంతమంది ప్రైవేటు వ్యక్తులను ఏర్పాటు చేసుకుని పేద ప్రజల నుంచి డబ్బులు దండుకుంటున్నారన్నారు. ప్రైవేటు వ్యక్తులు ఎస్ఐ శ్రీనివాసులు పేరు చెప్పి పేద ప్రజలను డబ్బుల కోసం వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాయచోటి కోర్టులో జడ్జి బెయిల్ ఇచ్చినా కొంత మంది గిరిజన నాయకులకు ఫోన్ చేసి మీరు కోర్టుకు ఎందుకుపోయారు, మీరు స్టేషన్‌కు రాకుంటే బైండోవర్ చేసి మీ కథ చూస్తా నని బెదిరిస్తున్నాడని వారు తెలిపారు. ఇలా కోర్టు నిబంధనలను, జడ్జి ఆదేశాలను కూడా లెక్క చేయకుండా బెదిరిస్తున్నారన్నారు. పేద ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులే ఇలా తయారయితే ఇక ప్రజలకు దిక్కెవరని వారు ప్రశ్నించారు. సుండుపల్లె ఎస్ఐ అవినీతి, అక్రమాలపైన సమగ్ర విచారణ చేసి ప్రజలకు రక్షణ కల్పించాలని జిల్లా ఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం: ఎమ్మెల్యే శ్రీధర్



రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్

రైల్వేకోడూరు రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధి తమ లక్ష్యమని జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ తెలిపారు. శుక్ర వారం రైల్వేకోడూరు పట్టణంలోని లక్ష్మీప్యారడైజ్ థియేటర్ సమీపంలో సిమెంట్ రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెపండుగలో భాగంగా నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో సిమెంట్ రోడ్ల పనులు జరుగుతున్నాయన్నారు. టీడీపీ యువ నాయకులు ముక్కా సాయివికాస్‌రెడ్డి, ముక్కా విశాల్ రెడ్డి , నాయకులు నార్జాల హేమరాజ్, సర్పంచ్ బుడిగి శివయ్య, కొప్పరపు అరవింద్, పఠాన్ మౌలా తదితరులు పాల్గొన్నారు.

కోటి మంది సభ్యులున్న పార్టీ టీడీపీ

రామాపురం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): కోటి మంది సభ్యత్వం కలిగిన ఏకైక ప్రాంతీయ పార్టీ తెలుగుదేశం అని రాయచోటి నియోజకవర్గ టీడీపీ నాయకుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి అన్నారు. మండలంలోని హసనాపురంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి నియోజకవర్గంలోని మారుమూల గ్రామాల్లో సైతం సిమెంటు రోడ్లు, తాగునీటి సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తున్నారన్నారు.

గుండెనొప్పిపై అలసత్వం వద్దు



మాట్లాడుతున్న డాక్టర్ ప్రకాశ్

సిద్దవటం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : గుండెనొప్పి వచ్చిన వెంటనే ఒక గంట లోపు ప్రభుత్వ వైద్యశాలకు తీసుకురావాలని డాక్టర్ ప్రకాశ్ సూచించారు. సిదవటం కమ్యూనిటీ వైద్యశాలలో శుక్రవారం ఆయన వైద్య సిబ్బందికి గుండె జబ్బుల నివారణపై సల హాలు, సూచనలు, సూచ నలు అందించారు. గుండెనొప్పి వచ్చిన పేషంట్ల కోసం ప్రభుత్వం ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రూ. 45 వేల రూపాయల విలువైన ఇంజక్షన్‌లు సిద్ధంగా ఉంచిందన్నారు. ఛాతీలో నొప్పి వచ్చినప్పుడు గుండె బరువుగా ఉండడం, నొప్పి వంటి లక్షణాలు ఉంటాయని, కొంతమంది గ్యాస్ట్రబుల్ అని అలసత్వం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మురళీ మోహన్, డాక్టర్ శివాజీ, గైనకాలజిస్టు డాక్టర్ జ్యోతి, డాక్టర్ శివాని, స్టాఫ్ నర్సులు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

జీవనోపాధి కల్పనకు కృషి

వీరబల్లి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): సమన్వయ పద్ధతిలో జీవనోపాధి కల్పనకు కృషి చేస్తున్నట్లు జిల్లా జీవనోపాధుల సమన్వయ అధికారి గంగార్జున తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సభా భవనంలో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో వీరబల్లి, గాలివీడు మండలాల నుంచి 300 కుటుంబాలతో మొదటి విడతలో రెండు క్లస్టర్లను ఎన్నుకున్నారన్నారు. సీఆర్పీలతో 300 కుటుంబాల బేస్‌లైన్ సర్వే పూర్తి చేసి ప్రభుత్వానికి డీపీఆర్ పంపించామన్నారు. ఏవో స్వాతి, పశువైద్యాధికారి నాగరాజు, ఉద్యానవన అధికారి వనిత, ప్రకృతి వ్యవసాయ అధికారి అపర్ణ, ఏరియా కోఆర్డినేటర్ కొండా శ్రీనివాసులరెడ్డి, ఏపీఎంలు పాల్గొన్నారు.

హైస్కూల్ వద్ద వ్యర్థాలు తొలగింపు

గాలివీడు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రవేశం వద్ద వ్యర్థాలను పంచాయతీ సిబ్బంది తాత్కాలికంగా తొలగించారు. హైస్కూల్ వద్ద వ్యర్థాలు వేయడంపై శుక్రవారం వార్తాపత్రికల్లో కథనాలు వెలువడటంతో కదిలిన పంచాయతీ యంత్రాంగం పారిశుధ్య చర్యలు చేపట్టింది. అయితే అలవాటులో భాగంగా చుట్టుపక్కల వారు వ్యర్థాలను అదే స్థానంలో పడవేస్తున్నారు. పాఠశాల ముందు పరిశుభ్రంగా ఉండేలా ఒక డస్ట్‌బిన్ ఏర్పాటు చేస్తే బాగుంటుందని విద్యార్థుల తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు.

పాఠశాల ఆవరణలో మొక్కలు నాటిన విద్యార్థి



కొబ్బరి మొక్క నాటుతున్న విద్యార్థి

పెనగలూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : పెనగలూరు మండలం చక్రం పేట ఉన్నత పాఠశాల ఆదో తరగతి విద్యార్థి తన పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం పాఠశాల ఆవరణలో 10 కొబ్బరి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా హెడ్మాస్టర్ గోపాలకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు వారి తల్లిదండ్రుల సహకారంతో ఏడాది కాలంలో వంద మొక్కలు నాటినట్లు తెలి పారు. భవిష్యత్‌లో జగ్గంపేట ఉన్నత పాఠశాలలో ఆహ్లాదకరమైన వాతావ రణం కల్పించేందుకు ఈ కార్యక్రమం తలపెట్టినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు యూనిఫాం తప్పనిసరి



ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఇన్‌స్పెక్టర్ బాబు

సిద్దవటం, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి) :ఆటో కార్మికులు తప్పనిసరిగా యూనిఫాం దుస్తులు ధరించాలని ఒంటిమిట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బాబు సూచించారు. సిద్దవటం పోలీసుస్టేషన్‌లో శుక్రవారం మండలంలో ఉన్న ఆటో డ్రైవర్లతో ఆయన మాట్లాడారు. ఆటోలపై పీఎస్ నంబరు ప్రదర్శించాలని, ప్రయాణికులను పరిమితికి మించి తరలించకూడదని, ఆటో వెళ్లేటప్పుడు పాటలు పెట్టడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం నేరమని, ప్రతిఒక్కరు నిబంధన ప్రకారమే వాహనాలు వినియోగించుకోవాలని కౌన్సిలింగ్ ఇచ్చారు. స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

కువైట్‌లో సుండుపల్లె వాసి మృతి

సుండుపల్లె, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): పొట్టకూటి కోసం కువైట్‌కి వెళ్లిన సగబాల ఓబులేసు(40) ఈ నెల 5వ తేదీ బుధవారం అర్ధరాత్రి కువైట్‌లో మృతి చెందినట్లు ఆయన కుటుంబ సభ్యులు శుక్రవారం తెలిపారు. ఆయన 15 ఏళ్ల క్రితం కువైట్‌కు వెళ్లాడు. 20 రోజుల క్రితం అనారోగ్యంతో కోమాలోకి వెళ్లి వైద్యం పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. శనివారం మృతదేహం స్వగ్రామానికి వస్తుందన్నారు. మృతుడికి తల్లిదండ్రులతో పాటు ఇద్దరు అన్నలు ఉన్నారు.

ఉలవ పంట దహనంపై ఫిర్యాదు

వీరబల్లి, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): నూర్పిళ్లకు సిద్ధంగా ఉన్న ఉలవ పంటకు తమ గ్రామానికే చెందిన వెంకటేశ్ అనే వ్యక్తి నిప్పంటించాడని మండలంలోని మట్టి తొగటపల్లికి చెందిన దేవరింట వెంకట మల్లికార్జున శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం పొలంలో జీవాలు మేపుతున్న వెంకటేశ్‌ను మందలించడంతో తనపై దాడి చేశాడన్నారు. అంతేగాక సాయంత్రం నూర్పిడికి సిద్ధం చేసిన ఉలవ పంటకు అగ్గి పెట్టడంతో పూర్తి గా కాలిపోయిందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీంతో రూ.30 వేల వరకు నష్టం కలిగిందని, తనకు న్యాయం చేయాలని కోరుకున్నాడు. సీఐ వర ప్రసాద్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గంజాయి పీల్చేస్తున్నారు..!

గంజాయి నిషాలో విద్యార్థులు తూగుతున్నారు. తల్లిదండ్రుల పర్యవేక్షణ లేకపోవడంతో విద్యకు దూరమై.. మత్తుకు బానిసయ్యారు. స్కూల్, కళాశాల పేరుతో ఇంట్లో నుంచి రావడం.. ఊరికి దూరంగా వెళ్లి గంజాయిని పీల్చేస్తున్నారు. పట్టణంలోని ఉద్యోగుల పిల్లలు సైతం గంజాయి, మద్యానికి అలవాటుపడి పెడదోవ పడుతున్నారు. ఎటుచూసినా కర్ణాటక మద్యం ప్యాకెట్లు, మాదక ద్రవ్యాలే దర్శనమిస్తున్నాయి. పోలీసులు చర్యలు తీసుకొని, యువతకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తే కొద్ది మేర తగ్గే అవకాశం ఉంది.

- విద్యకు దూరమై.. మత్తుకు బానిసై
- పెడదోవ పడుతున్న యువత
- గుట.. గుటా తాగేస్తున్న కర్ణాటక మద్యం
- అధికారుల నిర్లక్ష్యమే కారణమా..?

వాల్మీకిపురం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రాంతాల్లో గంజాయి, కర్ణాటక మద్యం విక్రయాల వాడకం ఎక్కువైందని ఆరోపణలు వస్తున్నాయి. వీటి అక్రమ రవాణా సులభతరం కావడంతో పట్టణంలోని జగనన్న కాలనీ, బైపాస్ రోడ్డుకు సమీపాన అటవీ ప్రాంతం వద్ద యువత ఎక్కువగా గంజాయి మత్తులో ఉంటున్నట్లు పలువురు చెబుతున్నారు. అలాగే స్థానిక రైల్వేస్టేషన్ ప్రాంతం, సమీప వ్యవసాయ పొలాల వద్ద యువకులు రహస్యంగా గుమికూడి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్న విమర్శలున్నాయి. పట్టణంలోని ఉద్యోగుల పిల్లలు సైతం గంజాయికి బానిసలై పెడదోవ పడుతున్నట్లు తెలిసింది. ముఖ్యంగా విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లకుండా మత్తులో తూగుతున్నారు. పోలీసులు గంజాయి, మద్యం అక్రమ రవాణాపై నిఘా పెట్టాలని పలువురు కోరుతున్నారు.

శ్రుతిమించిపోతున్న మందుబాబుల ఆగడాలు

స్థానిక ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంతంలో నిత్యం మందుబాబుల ఆగడాలు శ్రుతిమించిపోతున్నాయి. డిగ్రీ కళాశాల, ఉర్దూ హైస్కూల్, పరిసరాల్లో మద్యం దుకాణం ఉండడం, ఉదయం దుకాణం తెరిచిన సమయం నుంచి సాయంత్రం వరకు ఆ ప్రాంతంలో మందుబాబుల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. నిత్యం కళాశాల సమీపంలో మందుబాబుల చేసే చేష్టలకు విస్తుపోతున్నారు. ఈ వ్యవహారంపై స్థానిక అధికారులు సైతం ఏమీ చేయలేక మిన్నకుండిపోయినట్లు తెలిసింది. కళాశాల ముఖద్వారం సమీపంలో ముళ్లపొదలు విపరీతంగా పెరిగిపోవడం, ఎటుచూసినా మద్యం బాటిళ్ల దుర్గంధమే దర్శనమిస్తోంది. యువత ఈ వ్యవహారం పట్ల ఆకర్షితులై జీవితాలను దుర్భరం చేసుకోకుండా పోలీసులు కూడా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. అలాగే వాల్మీకిపురంలో గంజాయి, కర్ణాటక మద్యం అక్రమ రవాణాతో విక్రయాలు సాగిస్తున్న వ్యక్తులపై పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


వాల్మీకిపురం రైల్వే ట్రాక్‌పై తిరుగుతున్న విద్యార్థులు




వాల్మీకిపురం రైల్వే స్టేషన్ ప్రాంతంలో రహస్యంగా యువకుల సెల్‌ఫోన్ మంతనాలు

ఎటు చూసినా కర్ణాటక మద్యం ప్యాకెట్లే...

రెండేళ్ల కాలంగా వాల్మీకిపురం పట్టణ వ్యాప్తంగా కర్ణాటక మద్యం ఏరులై పారుతోంది. అర్ధరాత్రి సమయాల్లో కర్ణాటక మద్యం అక్రమంగా తరలించడంతో పాటు విక్రయాలకు ఈ ప్రాంత పరిసరాలు కేంద్రంగా మారాయి. ఎటు చూసినా తాగి పడేసిన కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు దర్శనమిస్తుంటాయి. పోలీసులు కర్ణాటక అక్రమ మద్యంపై ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టి కేసులు నమోదు చేసినప్పటికీ అక్రమ మద్యం మాత్రం వస్తూనే ఉంది. స్థానిక ఆర్టీసీ బస్టాండ్, జగనన్న కాలనీ, ఇందిరమ్మకాలనీ, తరిగొండ రోడ్డు, రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాలలో కర్ణాటక అక్రమ మద్యం విచ్చలవిడిగా విక్రయాలు కొనసాగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.


వాల్మీకిపురంలో మందుబాబులు తాగి పడేసిన కర్ణాటక మద్యం ప్యాకెట్లు

ముమ్మర నిఘా పెట్టాం



వాల్మీకిపురం మండల వ్యాప్తంగా గంజాయి, కర్ణాటక అక్రమ మద్యం, నాటుసారా తయారీ, విక్రయాలపై ముమ్మర నిఘా పెట్టి చర్యలు తీసుకుంటున్నాం. గంజాయి విక్రయాలు, వాడకంతో పట్టుబడితే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదు. మద్యం మత్తులో జీవితాలను దుర్భరం చేసుకుంటున్నామన్న విషయాన్ని ముఖ్యంగా యువత గమనించాలి. కర్ణాటక మద్యం అక్రమ రవాణా, విక్రయాలపై సర్కిల్ పరిధిలోని వాల్మీకిపురం, గుర్రంకొండ మండలాల్లో గట్టి నిఘా పెట్టి చర్యలు తీసుకుంటున్నాం. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల భవిష్యత్తు విషయమై ఎప్పటికప్పుడు శ్రద్ధ వహించాలి. ఎక్కడైనా సరే గంజాయి, కర్ణాటక మద్యం, నాటుసారా విక్రయాల విషయం తెలిస్తే తక్షణం పోలీసులకు సమాచారం అందించాలి.

- ప్రసాద్‌బాబు, సీఐ, వాల్మీకిపురం

ఇద్దరు దొంగలు అరెస్ట్

● రూ.99 వేల విలువైన వెండి వస్తువులు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న వెండి వస్తువులు, నిందితులతో ఏఎస్పీ

నందలూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కడప - తిరుపతి ప్రధాన రహదారిలోని మూసివేసిన ఆల్విన్ కర్మాగారం వద్ద శుక్రవారం ఇద్దరు దొంగలను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.99 వేల విలువైన వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు రాజంపేట ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్ హెగ్డే తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శుక్రవారం ఉదయం 11.30 గంటల సమయంలో ఆల్విన్ ఫ్యాక్టరీ గేటు వద్దకు వెళ్లిన ఎస్ఐ వెంకటేశ్వర్లును చూసి పారిపోయేందుకు ప్రయత్నించిన తలారి బాలకృష్ణ, పుర్లగుంట రామాంజిని వెంబడించి అదుపులోకి తీసుకున్నారన్నారు. వారి వద్ద ఉన్న సంచిలో మూడు వెండి కిరీటాలు, రెండు వెండి పళ్లాలు, మూడు వెండి దీపాలు ఒక శఠగోపము గుర్తించి స్వాధీనం చేసున్నారని తెలిపారు. ఆడపూరులోని మంచాలమ్మ ఆలయంలో గత డిసెంబరు 24న చోరీకి గురైన వస్తువులుగా వీటిని గుర్తించామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. ఈ కేసులో కీలకంగా వ్యవహరించిన కానిస్టేబుల్ దర్బార్‌బాసాను ఏఎస్పీ అభినందించారు. ఈ సమావేశంలో రాజంపేట రూరల్ సీఐ బీవీ రమణ, ఏఎస్ఐలు సుబ్బరాయుడు, శంకర్‌నాయక్, హెడ్‌కానిస్టేబుల్ రాజగోపాల్, పోలీసులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్యాయత్నం

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని పోలీసులు తెలిపారు. మదనపల్లె ఆస్పత్రి అవుట్ పోలీసుల వివరాల మేరకు... బి.కొత్తకోట మండలం, గట్టు పంచాయతీ, తొట్లవారిపల్లెకు చెందిన దేవేంద్ర భార్య లిఖిత(19)ఓ ప్రైవేటు కళాశాల్లో ఇంటర్ చదువుతోంది. శుక్రవారం తన మామ చిన్నపరెడ్డి గొడవ పడడంతో మనస్తాపానికి గురై విషద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబసభ్యులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

నాలుగు నియోజకవర్గాల తాగునీటికి జేజేఎం పథకం

●రూ. 2,904 కోట్లతో నూతన ప్రాజెక్టుకు డీపీఆర్ ● వెలిగల్లు నుంచి నీటి సరఫరా

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మదనపల్లె, పుంగనూరు, పలమనేరు, కుప్పం నియోజకవర్గాల ప్రజలకు తాగునీరు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.2,904కోట్ల అంచనాతో వెలిగల్లు రిజర్వాయర్ నుంచి నీటి సరఫరాకు నూతన ప్రాజెక్టు కోసం డీపీఆర్ (డీటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు) తయారు చేసిందని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే నివాసం వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రతి వేసవిలోనూ పట్టణాలు, గ్రామాల్లో తాగునీటి సమస్య వస్తోందని, దీన్ని దృష్టిలో పెట్టుకుని జల్‌జీవన్ మిషన్ కింద ఓవర్‌హెడ్ ట్యాంకులు, పైప్‌లైన్లు వేస్తారన్నారు. నియోజకవర్గంలో మదనపల్లె సహా 640 గ్రామాల్లో ప్రతి ఇంటికీ తాగునీటిని అందించేందుకు ఈ పథకాన్ని అమలు చేస్తారన్నారు. ఈ ప్రాజెక్టు పనులకు త్వరలోనే టెండర్లు పిలుస్తారని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు భవిష్యత్‌లో 30 ఏళ్లకు సరిపడా ప్రణాళికలతో పథకాలు అమలు చేస్తారన్నారు. మదనపల్లెను జిల్లా కేంద్రంగా చేసేందుకు చంద్రబాబు సుముఖంగా వున్నారన్నారు. మదనపల్లెలో ఆటోనగర్ ఏర్పాటుకు పూర్తిగా కృషి చేస్తానన్నారు. చిత్తూరు బస్టాండు నుంచి డీఎస్పీ కార్యాలయం వరకు రోడ్డు 100 అడుగుల వెడల్పు చేసేందుకు ప్రతిపాదనలు సీఎం దృష్టికి తీసుకెళ్లగా, ఆయన ఆర్అండ్‌బీ అధికారులను సర్వే చేయాలని ఆదేశించారన్నారు. పట్టణ శివారులో ఔటర్ రింగ్ రోడ్డుకు కృషి చేస్తామన్నారు. ప్రభుత్వాస్పత్రిని ప్రైవేటు పరం చేయనీయమని, మెడికల్ కాలేజిని పీపీపీ విధానంలోకి తీసుకొస్తామన్నారు. శనివారం తమ కార్యాలయం వద్ద ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) నిర్వహిస్తున్నామని, ప్రజలు వారి సమస్యలను తన దృష్టికి తీసుకురావచ్చన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ఆర్‌జే వెంకటేశ్, సుద్దిళ్ల సుధాకర్, నాదెళ్ల శివన్న, షంషీర్, చిన్న మహేష్, ఎంపీటీసీ దేవేంద్ర, బెల్లె రెడ్డిప్రసాద్, జేసీబీ మధు, కమలమర్రి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ఇదో రకం అధికార దర్పం...!

పీలేరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల్లో మహిళా ప్రజాప్రతినిధుల స్థానంలో వారి భర్త లేదా సంతానం పెత్తనం చెలాయించడం మనం చూస్తూ ఉంటాం. పెత్తనం చెలాయించినా అధికారిక కార్యక్రమాల్లో మాత్రం వారిని ఉత్సవ విగ్రహాల్లానైనా అప్పుడప్పుడూ వేదికలపై కూర్చోనిస్తారు. శిలాఫలాకాల్లో వారి పేర్లు వేయిస్తూ ఉంటారు. పీలేరు పంచాయతీ పాలకవర్గం మాత్రం ఇంకో అడుగు ముందుకు వేసి అధికారికంగా ఆవిష్కరించిన శిలాఫలకంలోనూ మహిళా వార్డు సభ్యుల పేర్ల కంటే ముందు వారి భర్తల పేర్లు వేయించి సరికొత్త ట్రెండ్‌కు తెరలేపారు. కాస్త ఆలస్యంగా వెలుగు చూసిన ఈ వ్యవహారం ఇలా ఉంది పీలేరు పంచాయతీ కార్యాలయం మీద శాశ్వత జాతీయ జెండాను ఆవిష్కరణ, మొదటి అంతస్తును(అది ఇంకా పూర్తి కాలేదు) 2023లో ఆర్భాటంగా ప్రారంభించారు. ఆ సందర్భంగా అప్పటి ప్రజాప్రతినిధులు, పంచాయతీ పాలకవర్గసభ్యులు, అధికారుల పేరిట శిలాఫలకం ఏర్పాటు చేశారు. ఆ శిలాఫలకంలో 2, 3, 5, 8, 10, 15, 18 వార్డుల్లో ఉండాల్సిన మహిళా సభ్యుల పేర్ల కంటే ముందు వారి భర్తల పేర్లు వేశారు. దీంతో ఆ శిలాఫలకం చూసిన వారు, ఇంతకీ వార్డు మెంబర్లు మహిళలా, పురుషులా అంటూ అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా పంచాయతీ సమావేశాల్లోనూ మహిళా సభ్యులు కనిపించరని పంచాయతీ సిబ్బంది గుసగుసలాడుకుంటున్నారు.

వార్డు	రికార్డుల్లో ఉన్న పేరు	శిలాఫలకంలో పేరు
2వ వార్డు	కె.లావణ్య	కె.నరేష్ లావణ్య
3వ వార్డు	ఎస్.లలితమ్మ	ఎస్.నాగభూషణ లలితమ్మ
5వ వార్డు	వై.సంధ్యావాణి	వై.మల్లిఖార్జున రెడ్డి సంధ్యావాణి
8వ వార్డు	ఎ.అస్మా తబస్సుం	ఎస్.మస్తాన్ అస్మా తబస్సుం
10వ వార్డు	జి.ఇస్మతారా బేగం	జి.కాలేషా ఇస్మతారా బేగం
15వ వార్డు	కె.సుకన్య	కె.పవన్ సుకన్య
18వ వార్డు	బుక్కే కళావతి	బుక్కే నాగరాజు కళావతి


పీలేరు పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన శిలాఫలకం

ములకలచెరువులో 144 సెక్షన్

● ఎంపీడీఓ కార్యాలయం దారులన్నీ బంద్
● పోలీసుల మోహరింపు ● ప్రశాంతంగా మండల సమావేశం


ఎంపీడీఓ కార్యాలయం వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

ములకలచెరువు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండల సమావేశం సందర్భంగా ములకలచెరువు మొత్తం పోలీసుల ఆధీనంలోకి వెళ్లింది. ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లే దారుల న్నింటిలో పోలీసులు మోహరించారు. సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులను మాత్రమే అనుమతించారు. 144 సెక్షన్ విధించడం, భారీ బందోబస్తు నడుమ ఎట్టకేలకు మండల సమావేశం ప్రశాంతంగా ముగిసింది. వైసీపీ ప్రజాప్రతినిధులు ప్రజాస్వామ్య బద్ధంగా కాకుండా తమ నామినేషన్లు చించి ఏకగ్రీవం చేసుకున్నారని, వీరికి మండల సమావేశాలకు వచ్చే అర్హత లేదని ఆరోపిస్తూ మండల సమావేశాలు జరగకుండా టీడీపీ నేతలు, కార్యకర్తలు అడ్డుకుంటున్నారు. ఇలా రెండు సార్లు సమావేశాలు జరపాలని అధికారులు తేదీలు నిర్ణయించినా టీడీపీ నేతల నిరసనతో వాయిదా పడింది. జనవరి 2న తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో మండల సమావేశం వాయిదా పడిన విషయం విదితమే. ఓ వైపు టీడీపీ... మరో వైపు వైసీపీ శ్రేణులు భారీగా మోహరించడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సభ్యులు సరైన సమయానికి రాలేదని మండల సమావేశాన్ని వాయిదా వేయడంతో వైసీపీ ప్రజాప్రతినిధులు ఎంపీడీఓ హరినారాయణపై దౌర్జన్యానికి పాల్పడి మినిట్స్ బుక్‌ను లాక్కుని నానా దుర్భాషలాడారు. దీనిపై ఎంపీడీఓ పోలీసులకు చేసిన ఫిర్యాదుపై కేసు కూడా నమోదైంది. ఈ క్రమంలో తిరిగి శుక్రవారం మండల సమావేశం నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. ఈ క్రమంలో ఇటీవల చిత్తూరు జడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడు మండల సమావేశం సజావుగా జరిపేందుకు ములకలచెరువుకు వచ్చారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డితో సమావేశమై చర్చలు జరిపారు. మండల అభివృద్ధి కోసం సమావేశానికి ఐదుగురు కూటమి నేతలను ప్రత్యేక ఆహ్వానితులుగా అనుమతి ఇచ్చారు. ఈ క్రమంలో శుక్రవారం నిర్వహించిన మండల సమావేశం ప్రశాంతంగా జరిగింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీగా మోహరించి బందోబస్తు నిర్వహించారు. మదనపల్లె డీఎస్పీ కొండయ్యనాయుడు, సీఐ లక్ష్మన్న, ఎస్ఐలు నరసింహుడు, లోకేష్‌రెడ్డి, గాయత్రి బందోబస్తును పర్యవేక్షించారు. అనుకున్న సమయానికి ప్రారంభమైన మండల సమావేశం వివిధ శాఖల మీద చర్చలతో ముగిసింది. సమావేశానికి ఎనిమిది శాఖల అధికారులు డుమ్మా కొట్టారు. సమావేశంలో ఎంపీడీఓ హరినారాయణ, ఎంపీపీ సాయిలీల, జడ్పీటీసీ మోహన్‌రెడ్డి, కూటమి నేతలు ప్రసాద్‌రెడ్డి, నరసింహారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సుదర్శన్, జయరామ్‌రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉర్దూ అకాడమీకి తూట్లు పొడిచిన వైసీపీ

● కూటమి పాలనతో రాష్ట్రంలో ప్రశాంతత ● రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఎంఏ షరీఫ్


హార్సిలీహిల్స్‌లో మాట్లాడుతున్న శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్, తదితరులు

బి.కొత్తకోట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): తమ ఐదేళ్ల పాలనలో ఉర్దూ అకాడమీకి తూట్లు పొడిచి, ముస్లిం మైనారిటీల సంక్షేమాన్ని తుంగలో తొక్కిన పార్టీ వైసీపీ అని శాసనమండలి మాజీ చైర్మన్, రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ వెల్ఫేర్ సలహాదారు ఎంఏ షరీఫ్ విమర్శించారు. గురువారం కడప జిల్లా పర్యటన ముగించుకుని హార్సిలీహిల్స్‌కు చేరుకుని, గవర్నర్ బంగ్లాలో బస చేశారు. శుక్రవారం ఉదయం విలేఖరులతో ఆయన మాట్లాడుతూ ముస్లింల సంక్షేమానికి, విద్యాభివృద్ధికి, ఉర్దూ భాషా వికాసానికి సీఎం చంద్రబాబు కట్టుబడి ఉన్నారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాదులోని గచ్చిబౌలిలో 250 ఎకరాల భూమిని కేటాయించి, అప్పటి ప్రధాని వాజ్‌పేయి సహకారంతో అబుల్‌కలాం ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీని నెలకొల్పిన ఘనత చంద్రబాబుదేనన్నారు. ఉర్దూ పాఠశాలలను ఎత్తేస్తున్నారని, ఉపాధ్యాయ పోస్టులను తగ్గించేస్తున్నారని వైసీపీ పత్రికలో వస్తున్న వార్తలను ఖండిస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 12 ఉర్దూ రెసిడెన్షియల్ స్కూల్ భవనాలు, హాస్టల్ భవనాలకు రూ.30 కోట్లు నిధులిచ్చామన్నారు. ఎంఎస్‌డీపీ కింద కడప, కదిరి, గుంతకల్లు, రాయచోటి తదితర ప్రాంతాల్లో జూనియర్ కళాశాల, హాస్టల్ భవనాలను నిర్మించబోతున్నట్లు ఆయన వెల్లడించారు. బి.కొత్తకోటలో రూ.50 లక్షలతో టీడీపీ హయాంలో నిర్మించిన షాదీ మహల్‌ను వైసీపీ నేతలు ఉద్దేశపూర్వకంగా ప్రారంభించలేదన్న సమాచారంపై ఆయన స్పందిస్తూ అవసరమైన నిధులు విడుదల చేస్తామన్నారు. అంతకు ముందు పలువురు మైనార్టీ నేతలు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ కార్య నిర్వాహక కార్యదర్శి పర్వీన్‌తాజ్, అయూబ్‌బాషా పాల్గొన్నారు.

బయో రీసోర్స్ సెంటర్ ఏర్పాటుకు కృషి

కలికిరి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): కలికిరిలోని కృషి విజ్ఞాన కేంద్రంలో బయో రీసోర్స్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేస్తామని అగ్రికల్చర్ టెక్నాలజీ అప్లికేషన్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (అటారీ) జోన్-10(హైదారాబాద్) డైరెక్టర్ డాక్టర్ షేక్ ఎన్.మీరా ప్రకటించారు. కలికిరిలోని కృషి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం శాస్త్రీయ సలహా సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేరుశనగలో అడవి పందుల బెడద, ఉలవ పంట కోయడానికి హార్వెస్టర్, కొబ్బరిలో సమస్యలైన నల్లి, రుగోస్ ఫ్లై, మామిడిలో తేనె మంచుపురుగు, మిరపలో తామర పురుగుల నివారణ కోసం పరిశోధనలు ముమ్మరం చేయడానికి బయో రీసోర్స్ సెంటర్ ఉపయోగపడుతుందన్నారు. ఇదే అంశాల మీద ఆయన రైతులతో చర్చించి వారు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకున్నారు. వ్యవసాయంలో మిత్ర పురుగులు, ఆర్గానిక్ మందులు అందుబాటులోకి తేవాలని ఆయనను రైతులు కోరారు. అంతకు మునుపు కలికిరి కృషి విజ్ఞాన కేంద్రం డైరెక్టర్ డాక్టర్ కె.మంజుల 2024-25లో చేసిన వివిధ కార్యక్రమాలు, 2025-26లో చేపట్టబోయే కార్యక్రమాల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం (గుంటూరు) విస్తరణ సంచాలకులు డాక్టర్ శివనారాయణ, కలికిరి కేవీకే సహ సంచాలకుడు డాక్టర్ సుమతి, తిరుపతి వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ మహేశ్వరరెడ్డి, డాక్టర్ దేవకి, డాక్టర్ వసంత, 'రాస్' కేవీకే ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ శ్రీనివాస్, వేలూరు కేవీకే ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డా.తిరుమురుగన్, అన్నమయ్య జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ గుణశేఖర్, పీలేరు ఉద్యానశాఖాధికారి సుకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.


కలికిరిలో రైతులతో మాట్లాడుతున్న డాక్టర్ మీరా, తదితరులు

అంతరాయం లేని విద్యుత్ అందించాలి

● ఏపీ ట్రాన్స్‌కో ఎస్ఈ చంద్రశేఖరరెడ్డి

పీలేరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు అంతరాయం లేని విద్యుత్ సరఫరా అందజేయాలని ఏపీ ట్రాన్స్‌కో ఎస్ఈ చంద్రశేఖరరెడ్డి పీలేరు డివిజన్ విద్యుత్ సిబ్బందిని ఆదేశించారు. పీలేరులోని ట్రాన్స్‌కో ఈఈ కార్యాలయంలో శుక్రవారం డివిజన్ స్థాయి సమీక్షలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో లో-ఓల్టేజ్ సమస్యను అధిగమించేందుకు రెండు కొత్త సబ్-స్టేషన్లు మంజూరయ్యాయన్నారు. నాయనివారి పల్లె, వాల్మీకిపురం మండలం టి.సాకిరేవుపల్లె గ్రామాల్లో 33/11 కేవీ విద్యుత్ సబ్-స్టేషన్‌ల కోసం స్థలపరిశీలన కూడా పూర్తయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'సూర్య ఘర్' పథకంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. అనంతరం డివిజన్ పరిధిలో జరుగుతున్న కార్యకలాపాలను వాకబు చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో ఈఈ చంద్రశేఖరరెడ్డి, ఏడీ అమీర్‌బాషా, జిల్లా అకౌంట్ ఆఫీసర్ బ్రహ్మయ్య ఆచారి, ఏఈలు ఖాదర్ ఇలాహీ, రామ్మూర్తి, వరప్రసాద్, ముజీబ్ పాల్గొన్నారు.

ముగిసిన ఫుట్‌బాల్ లీగ్ పోటీలు


మొదటి బహుమతిని అందజేస్తున్న సబ్‌కలెక్టర్

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా ఉన్నత పాఠశాలలో పది రోజులుగా జరుగుతున్న ఖేలో ఇండియా అస్మిత అండర్-17 బాలికల ఫుట్‌బాల్ లీగ్ పోటీలు శుక్రవారంతో ముగిశాయి. మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ మాట్లాడుతూ పట్టణంలో బాలికల విభాగంలో ఫుట్‌బాల్ పోటీలు చేయడం సంతోషంగా ఉందన్నారు. బాలికలు ఇలాంటి అవకాశాలు ఉపయోగించుకోవాలని కోరారు. ఈ రౌండ్ రాబిన్ డబుల్ లీగ్ పోటీల్లో ప్రథమ స్థానం శ్రీవేద స్కూల్ విద్యార్థులు, ద్వితీయ స్థానం వశిష్ట పాఠశాల విద్యార్థులు కైవసం చేసుకున్నారు. మొదటి, రెండోవ స్థానాలలో నిలిచిన పాఠశాలలకు రూ.50 వేలు, 30 వేలు చెక్కులను క్రీడాకారులకు అందించారు.

అధ్వానంగా.. ఐసీయూ

- కాలం చెల్లిన పరికరాలు,
- విరిగిపోయిన మంచాలు, చిరిగిపోయిన బెడ్లు
- అందుబాటులో లేని ఆక్సిజన్ సిలిండర్లు
- అటకెక్కిన సెంట్రల్ ఏసీ ● కరెంటు సరఫరా అంతంతే..
- ఇదీ ఘనత వహించిన రిమ్స్‌లో దుస్థితి

ఐసీయూ (ఇంటెన్సివ్ కేర్ యూనిట్) అంటే.. అత్యవసర విభాగం.. ఇక్కడ చేర్చే రోగులు తీవ్రస్థాయి అనారోగ్యంతో ఉంటారు. వీరికి సరైన సమయంలో సక్రమంగా వైద్యం అందించాల్సి ఉంటుంది. ఇక్కడ ఏ మాత్రం ఏమరపాటుగా ఉన్నా.. రోగులకు అందించే వైద్యంలో తేడా వచ్చినా క్షణాల్లో వారి ప్రాణాలు ఇట్టే గాలిలో కలిసి పోతాయి. అయి తే ఇంతటి ప్రాధాన్యత ఉన్న ఐసీయూ సరైన వైద్య సేవలు అందిం చలేక అరకొర వసతులతో ప్రాణాపాయ స్థితిలో కొట్టు మిట్టాడు తోంది. ఇది ఎక్కడో మారుమూల ఆసుపత్రిలో కాదు. ఇది ఘనత వహించిన ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో నెలకొన్న దుస్థితి.



కడప సెవెన్ రోడ్స్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కడప నగర పరిధిలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో దాదాపు 900 పడకలతో రోగులకు వైద్యసేవలను అందిస్తున్నారు. ప్రతిరోజు సుమారు 1200 నుంచి 1500 వరకు ఓపీ కొనసాగుతోంది. వైద్యం కోసం వచ్చే రోగల సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. అయితే ఆసుపత్రి ప్రారంభంలో ఐసీయూ 20+20 పడకలతో మొదలు కాగా.. ఇప్పటికీ అలాగే కొనసాగుతోంది. అవే పరికరాలు, పాడై పోయిన బెడ్లపై అరకొర వసతులతో వైద్యం అందిస్తూ కాలం గడుపుతున్నారు.

అరకొర వసతులతో వైద్య సేవలు

ఐసీయూలో పూర్తిస్థాయి వైద్య పరికరాలతో పాటు ఆక్సిజన్ తప్పక అందుబాటులో ఉండాలి. ఇక వెంటిలేటర్ మిషన్లలో కొన్ని రకాల పరికరాల పని సామర్థ్యానికి ఎయిర్ కండిషన్ కూడా చాలా కీలకం. అయితే ప్రభుత్వ సరస్వజన ఆసుపత్రిలో సెంట్రల్ ఎయిర్ కండీషన్ సిస్టం పనిచేయడం లేదు. ప్రత్యామ్నయంగా రూంలో వాడే ఐసీలు, టేబుల్ ఫ్యాన్‌లతో వైద్య సేవలను అందిస్తున్నారు. సెంట్రల్ ఏసీ కాస్త అటకెక్కింది. కరెంటు సరఫరా సైతం ఐసీయూలో ఇబ్బంది పెడుతూనే ఉంటుంది. ఇక కాలం చెల్లిన, విరిగిన మంచాలపైన వైద్య సేవలను అందిస్తున్నారు. సెంట్రల్ ఆక్సిజన్ సరఫరా అందుబాటులో ఉన్నప్పటికి గేజ్ మిషన్లు పనితీరు అంతంత మాత్రమే. ఆక్సిజన్ లీకేజీల వల్ల ఏదైనా అగ్నిప్రమాదం సంభవిస్తే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుంది.



పరదాలు లేని ఐసీయూలో వైద్య సేవలు



విరిగిన మంచానికి కట్లు



ఆక్సిజన్ అందించే గేజ్ మిషన్ల పరిస్థితి



ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం

ఆసుపత్రిలో కొన్ని సౌకర్యాల కల్పనకు, బెడ్ల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. సెంట్రల్ ఏసీ మరమ్మత్తులు వచ్చినపుడు రోగులకు ఇబ్బంది లేకుండా ఏసీ మిషన్లు, ఫ్యాన్లు అమర్చాం. ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదనలు ఆమోదం పొందితే మరింత మెరుగ్గా రోగులకు సౌకర్యాలు అందిస్తాం. ఐసీయూను నిరంతరం పర్యవేక్షిస్తుంటాం. రోగులకు ఇబ్బంది లేకుండా చూస్తున్నాం.

-డాక్టర్ శ్రీనివాసులు సీఎస్ఆర్ఎంఓ, సర్వజన ఆసుపత్రి, కడప

రోగుల అవస్థలు వర్ణనాతీతం

ఐసీయూలో కిటికీలకు పరదాలు కరువయ్యాయి. బెడ్డు మీద వైద్యం చేయించుకుంటున్న రోగులు బాహాటంగా అందరికి కనిపిస్తున్నారు. ముఖ్యంగా మహిళా రోగులు ఉన్న బెడ్ల వద్ద ఉన్న కిటికీలకు కూడా కర్టెన్లు లేకపోవడంతో వైద్యం పొందే సమయంలో తీవ్ర అసౌకర్యానికి గురవతున్నారు. కొన్నిచోట్ల కిటికీలకు అడ్డంగా అట్టలను ఉంచి కవర్ చేస్తున్నారు. రోగులు బాత్‌రూం వెళ్లేందుకు వీల్‌చెయిర్‌ల కోసం గంటల తరబడి వేచి చూ డాల్సిన పరిస్థితి. ఇప్పటికైనా జిల్లా అధికారులు చర్యలు చేప ట్టి అత్యవసర వైద్య సేవల విభాగాల్లో అన్ని వసతులు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

హుండీల లెక్కింపుతో గండికి రూ. 17లక్షల ఆదాయం



గండి క్షేత్రంలో హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

చక్రాయపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): గండి వీరాంజనేయస్వామి దేవస్థానంలో శుక్రవారం సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో హుండీల లెక్కింపు కార్యక్రమం జరిగింది. ఈ హుండీల లెక్కింపుతో రూ.17,00,750 ఆదాయం వచ్చింది. అలాగే నిత్య అన్నదాన ప్రసాదం హుండీ ద్వారా రూ.30 వేలు, నాలుగు గ్రాముల బంగారు, 320 గ్రాముల వెండి, రెండు డాలర్లు వచ్చాయి. 80 రోజుల హుండీల లెక్కింపు శుక్రవారం జరిగింది. జిల్లా దేవదాయశాఖ జూనియర్ అసిస్టెంట్ భారతి, ప్రధాన అర్చకులు కేసరి, ఉప ప్రధాన అర్చకులు రాజారమేష్, దేవస్థాన చైర్మన్ కావలి కృష్ణతేజ, మాజీచైర్మన్ వెంకటస్వామి, ఏపీజీబీ మేనేజర్ భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండోలో మెరిసిన ముత్యాలు

- రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ



పతకాలు సాధించిన చిన్నారులు

ప్రొద్దుటూరు రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో జరిగిన ఎన్టీఆర్ మెమోరియల్ తైక్వాండో చాంపియన్ షిప్-2025 పోటీల్లో కడప జిల్లా విద్యార్థులు పతకాల పంట పండించారు. జనవరి 30 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు జరిగిన తైక్వాండో రాష్ట్రస్థాయి పోటీల్లో అద్భుత ప్రదర్శనతో మొత్తం 17 పతకాలు సాధించి ఓవరాల్ రన్నరప్‌గా నిలిచి ప్రతిభను చాటారు. ఈ పోటీల్లో మొత్తం 9 స్వర్ణ పతకాలు, 4 రజిత, 4 కాంస్య పత కాలు సాధిం చినట్లు కోచ్‌లు కమాల్, రాజేష్‌లు తెలిపారు. మహిత, సత్య భామ, ఏస్వరి, హాసిక, కీర్తన, విజయసుందరరాజు, దినేష్, హేమ, తనిష్‌లు స్వర్ణపతకాలు సాధించగా, వెంకట మోక్షిత, నిహాల్, తేజస్వీ, త్రివేణిలు కాంస్య పతకాలను, మహర్నిష్, యోగి విశ్వనాథరెడ్డి, భరత్, ఫరియాలు రజిత పతకాలను సాధించినట్లు వివరించారు.

అనుమానాస్పద స్థితిలో ఇటుకల బట్టీ కార్మికుడి మృతి



ఆసుపత్రిలో స్ట్రెచర్‌పై ఉన్న బ్రహ్మం మృతదేహం

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండలం రామేశ్వరంలోని ఇటుకల బట్టీలో పనిచేసే బ్రహ్మం (30) అనే కార్మికుడు శుక్రవారం అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. బ్రహ్మం తల్లి సంధ్యావతి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.... దొరసానిపల్లెలో నివాసముంటున్న సంధ్యావతి, శివ శంకర్‌లకు ముగ్గురు సంతానం. పెద్ద కుమారుడైన బ్రహ్మం గత ఐదేళ్లుగా రామేశ్వరంలోని నలగట్ల శ్రీనివాసులరెడ్డి అలియాస్ బెంగుళూరు శ్రీనుకు చెందిన సిమెంటు ఇటుకల ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. సూమారు రెండేళ్ల క్రితం బ్రహ్మం నాగలక్ష్మి అనే ముగ్గురు పిల్లలు గల వివాహితను ప్రేమ వివాహం చేసుకున్నాడు. అదే ఇటుకల బట్టీలో యజమాని శ్రీనివాసులరెడ్డి ఇచ్చిన రేకుల గదిలో నివాసముంటున్నారు. వివాహం చేసుకున్నప్పటి నుంచి బ్రహ్మం తల్లిదండ్రుల వద్దకు వెళ్లలేదు. వివాహం అయిన రెండు రోజు లకు తల్లిదండ్రులు వెళ్లి కుమారుడితో మాట్లాడటానికి ప్రయ త్నించగా బట్టి యజమాని మీ కుమారుడు వివాహం చేసుకొని మా బట్టిలోనే బతుకుతున్నాడు. అతడి బాధ్యత నాదేనని.. తల్లిదండ్రులకు చెప్పి పంపించాడు. అయితే శుక్రవారం ఉదయం 10.30 గంటలకు మీ కొడుకు ఫ్యానుకు ఉరి వేసుకున్నాడని తల్లిదండ్రులకు శ్రీనివాసులరెడ్డి ఫోన్ చేశాడు. అప్పటికే మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడకు తల్లిదండ్రులు వెళ్లి చూడగా బ్రహ్మం విగత జీవిగా స్ట్రెచర్ మీద వున్నాడు. ఇటుకల బట్టీలో ఉరి వేసుకుంటే పోలీసులకు ఫోన్ చేయకుండా నేరుగా జిల్లా ఆసుపత్రికి ఎందుకు తీసుకొచ్చారని బ్రహ్మం తల్లి సంధ్యావతి ప్రశ్నించారు. బ్రహ్మం మృతికి అతని భార్య నాగలక్ష్మి, ఇటుకల బట్టి యజయానిపై అనుమానం ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతదేహంపై ఉరివేసుకున్నట్లు గొంతుపై ఎలాంటి ఆనవాళ్లు కనిపించలేదని.. పోలీసులు తమ కుమారుడి మరణంపై పూర్తిస్థాయిలో విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు.

బంగారు గొలుసు అపహరణ



బాధితురాలి నుంచి వివరాలు సేకరిస్తున్న సీఐ, ఎస్ఐ

వల్లూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆదినిమ్మాయపల్లె డ్యాంకు వెళ్లే రహదారిలో కొత్తపల్లె చెరువు వద్ద శుక్రవారం ఉదయం మహిళమెడలోని గొలుసును దుండగుడు లాక్కెళ్లినట్లు వల్లూరు సీఐ రోషన్ తెలిపారు. సి.కొత్తపల్లెకు చెందిన కాంతమ్మ తన పశువులను చెరువు వద్ద మేపుకుంటుండగా దుండగుడు ద్విచక్రవాహనంపై వచ్చి లాక్కెళ్లినట్లు వెల్లడించారు. రెప్పపాటులో జరిగిన ఆ సంఘటన చూసి బిత్తర పోయిన కాంతమ్మ కేకలు వేయగా అగంతకుడు తన ద్విచక్రవాహనంలో ఆదినిమ్మాయపల్లె వైపు వెళ్లిపాయాడు. ఈమేరకు ఆమె తన బంధువులను స్టేషన్‌కు రావడంతో అక్కడున్న పోలీసులు దుండగుడి కోసం ఆరా తీస్తున్నారు. ఈ విషయం తన దృష్టికి రావడంతో ఇన్‌చార్జ్ ఎస్.ఐ. ప్రతాప్‌రెడ్డితో కలిసి సంఘటనా స్థలికి వెళ్లి పరిశీలించామన్నారు. సిబ్బందిని అప్రమత్తం చేసి అన్ని రూట్లకు పంపించినట్లు తెలిపారు. కాగా దుండగుడి వివరాలను ఎర్రపల్సర్ బండి, ఎరుపు రంగు టీషర్టు, మూతికి మాస్క్ ధరించారని బాధితురాలు తెలిపారు. కేసును దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రోషన్ వెల్లడించారు.

మామపై అల్లుడు దాడి

కడప(క్రైం), ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కడప నగరం భగత్ సింగ్‌నగర్‌లో శుక్రవారం మామపై అల్లుడు దాడి చేసినట్లు తాలుకా ఎస్ఐ తాహీర్ హుస్సేన్ తెలిపారు. పఠాన్ మగ్బూల్ బాష, అతడి అల్లుడు షారుక్‌ఖాన్‌ల మధ్య కుటుంబ తగదాలు నెలకొన్నాయి. దీంతో అల్లుడు మామను దాడి చేసి గాయపరిచినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

పీఎఫ్ ఖాతాను ఆన్‌లైన్ చేయాలి

- జడ్పీ సీఈఓకు యూటీఎఫ్ వినతి

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలకు సంబంధించి 2023-24, 2024-25 వార్షిక జమలను వెంటనే ఆన్‌లైన్ చేయాలని యూటీఎఫ్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో ముఖ్య కార్య నిర్వహణ అధికారి సి.ఓబులమ్మను కలిసి యూటీఎఫ్ జిల్లా శాఖ పక్షాన వినతిపత్రం సమర్పించారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్‌బాబులు మాట్లాడుతూ జిల్లాలోని మండల పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులు తమ జీతభత్యాల నుంచి కొంత సొమ్మును ప్రతినెల ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలకు పొదుపు కింద జమచేస్తున్నారన్నారు. 2022-23 వరకు మాత్రమే ఆన్‌లైన్ చేశారని, ఇప్పటి వరకు ఆన్‌లైన్ చేయలేదన్నారు. కావున చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వై.రవికుమార్, కె.రసింహారావు, రూతు ఆరోగ్యమేరీ, చంద్రశేఖర్, గోపీనాథ్, మేరీ ప్రసన్న, రామకేశవ, వీరనారాయణ ఉన్నారు.



సీఈఓ ఓబుళమ్మకు వినతిపత్రం సమర్పిస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

ఘనంగా ఉరుసు మహోత్సవాలు



వాల్మీకిపురం ఉరుసు ఉత్సవాలకు హాజరైన మైనార్టీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారుడు ఎంఏ షరీఫ్

వాల్మీకిపురం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): హసన్‌ఖాన్ వీధిలో జూటహజ్రత్‌ఖ్వాజా పీర్ మస్తాన్‌వలి దర్గాలో శుక్రవారం ఉరుసు మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం దర్గాలో గంధం, ముషాయిరా నిర్వహించారు. మరో రెండు రోజులు ఉరుసు, ఖవ్వాలి, తహలీల్‌ఫాతేహా జరగనున్నాయి. తొలిరోజు ఉరుసు మహోత్స వాల్లో రాష్ట్ర మైనార్టీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారుడు ఎంఏ షరీఫ్, ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి చాదర్ సమర్పించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్ర మంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కంభం నిరంజన్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, ఉపాధ్యక్షుడు బొక్కసం రామకృష్ణ, నాయకులు పీవీ నారాయణ, చంద్రమౌళి, మురళి, కువైట్ సయ్యద్‌బాషా, డిష్ బ్రదర్స్, దర్గా కమిటీ అధ్యక్షు డు సయ్యద్ బాషా, మైనార్టీ నేతలు, మతపెద్దలు, యువత పాల్గొన్నారు.

సన్నబియ్యం అందిస్తే హాజరు పెరుగుదల

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకంలో సన్నబియ్యంతో కూడిన పౌష్టికాహారాన్ని అందించడం వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో హాజరుశాతం పెరుగుతుందని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యాహ్న భోజన పథకంతో పాటు సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు సన్నబియ్యాన్ని అందించాలని మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోవడం హర్షణీయమన్నారు.

విద్యార్థుల హాజరుశాతం పెంచడంతో పాటు విద్యాభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు సహేతుకంగా ఉన్నాయన్నారు. వీటితో పాటు విద్యా వ్యవస్థకు అడ్డంకిగా మారిన 117 జీఓను సమూలంగా రద్దు చేసి విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తిని కూడా తగ్గించి ఒక్క ఉపాధ్యాయ పోస్టు కూడా పోకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

హోటళ్లపై విజిలెన్స్ దాడులు

- 15 సిలిండర్లు స్వాధీనం



పట్టుబడిన గ్యాస్ సిలిండర్లతో విజిలెన్స్ అధికారులు

కడప(క్రైం)ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కమాలాపురం, ఎర్రగుంట్ల ప్రాంతాలలో శుక్రవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించి 15 సిలిండర్లను సీజ్ చేసినట్లు డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ గీతావాణి తెలిపారు. గృహాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్లను హోటళ్లకు వినియోగిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడులు చేశామని తెలిపారు. వంట గ్యాస్‌ను వాణిజ్య కార్యకాలపాలకు వినియోగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

క్రమశిక్షణ, పట్టుదలతో చదవాలి

వేంపల్లె, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే ఎలాంటి పరీక్షలోనైనా విజయం సాధ్యమవుతుందని బాంబే ఐఐటీలో చదివిన అయ్యపువని వంశీనాధ్ తెలిపారు. సాఫ్ట్‌వేర్ కంపెనీలో కోటి రూపాయల ఉద్యోగాన్ని వదులుకొని యూపీఎస్సీ ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షకు ప్రిపేర్ అవుతున్న వంశీనాద్ ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్త ఇక్కడి విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందని, తన కుమారుడు వంశీనాధ్‌తో విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు ఇప్పించారు. ఈ సందర్భంగా వంశీనాధ్ మాట్లాడుతూ ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు నిరంతరం శ్రమించాలన్నారు. కార్యక్రమంలో ట్రిపుల్‌ఐటీ అకడమిక్ డీన్, సీఎస్ఈ హెచ్ఓడీ రత్నకుమారి, ఏఓ రవికుమార్, డీన్ రమేష్, ప్లేస్‌మెంట్ అధికారి సుందర్ తదితరులు పాల్గొన్నారు.

మన మిత్ర ద్వారా హాల్ టికెట్లు

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు సంబంధించి సెకండియర్ ఎంపీసీ, బైపీసీ చదువుతున్న విద్యార్థులు ప్రాక్టికల్ హాల్ టికెట్స్‌ను కాలేజ్ లాగిన్ పబ్లిక్ డొమైన్ హెచ్‌టీటీపీఎస్://బీఐఈ.ఏపీ.జీఓవి.ఇన్‌లో అందుబాటులో ఉన్నట్లు ఆర్ఐఓ వెంకటసుబ్బయ్య తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన మనమిత్ర (వాట్సప్ గవర్నెన్స్) ద్వారా 9552300009 అనే నెంబర్‌కు హాయ్ అనే మెసేజ్ పంపించి.. అందులో ఎడ్యుకేషన్ సర్వీసెస్ ఆప్షన్ ఉపయోగించి ప్రీవియస్ హాల్ టికెట్ నెంబర్ లేదా ఆధార్ నెంబర్, పుట్టిన తేదీలను ఎంటర్ చేసి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు.

కువైట్‌లో సుండుపల్లె వాసి మృతి

సుండుపల్లె, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పొట్టకూటి కోసం కువైట్‌కి వెళ్లిన సగబాల ఓబులేసు(40) ఈ నెల 5వ తేదీ బుధవారం అర్ధరాత్రి కువైట్‌లో మృతి చెందినట్లు ఆయన కుటుంబ సభ్యులు శుక్రవారం తెలిపారు. ఆయన 15 ఏళ్ల క్రితం కువైట్‌కు వెళ్లాడు. 20 రోజుల క్రితం అనారోగ్యంతో కోమాలోకి వెళ్లి వైద్యం పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. శనివారం మృతదేహం స్వగ్రామానికి వస్తుందన్నారు.

ఉలవ పంట దహనంపై ఫిర్యాదు

వీరబల్లి, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): నూర్పిళ్లకు సిద్ధంగా ఉన్న ఉలవ పంటకు తమ గ్రామానికే చెందిన వెంకటేష్ అనే వ్యక్తి నిప్పంటించాడని మండలంలోని మట్లి తొగటపల్లికి చెందిన దేవరింట వెంకట మల్లికార్జున శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం పొలంలో జీవాలు మేపుతున్న వెంకటేశ్‌ను మందలించడంతో తనపై దాడి చేశాడన్నారు. అంతేగాక సాయంత్రం నూర్పిడికి సిద్ధం చేసిన ఉలవ పంటకు అగ్గి పెట్టడంతో పూర్తి గా కాలిపోయిందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీంతో రూ.30 వేల వరకు నష్టం కలిగిందని, తనకు న్యాయం చేయాలని కోరుకున్నాడు. సీఐ వర ప్రసాద్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ముగిసిన ఉద్యాన విద్యార్థుల సాంస్కృతిక, క్రీడా పోటీలు

- ఓవరాల్ చాంపియన్‌గా అనంతరాజుపేట కళాశాల

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతరాజు పేట ఉద్యాన కళాశాల ఆవరణలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న ఉద్యాన అంతర కళాశాలల రాష్ట్ర స్థాయి సాంస్కృతిక, క్రీడా పో టీలు శుక్రవారం ముగిశాయి. ఈ పోటీల్లో 9 కళాశాలలకు చెందిన 450 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో నువ్వా నేనా అన్నట్లుగా విద్యార్థులు పోటీ పడి అన్ని క్రీడులు ఆడారు. హోరాహోరీగా సాగిన పోటీల్లో అనంతరాజుపేట ఉద్యాన విద్యార్థులు అన్ని అంశాల్లో అదరగొట్టారు. సాంస్కృతిక, సాహిత్య క్రీడా పోటీల్లో ఓవరాల్ చాంపి యన్‌గా నిలిచారు. విజేతలకు ఉద్యాన యూనివర్శిటీ ఉపకులపతి కే.గోపాల్ బహుమతులు అందించి అభినందించారు. అనంతరాజుపేట కళాశాల ఉద్యో గులు, అధ్యాపకులను అభినందించారు. ముగింపు కార్యక్రమంలో డీఎస్ఏ డాక్టర్ సూర్యకుమారి, డీఈ గోవిందరాజులు, అసోసియేట్ డీన్ పీటీ శ్రీనివాస్, ఓఎస్ఏ డాక్టర్ సయ్యద్ సదరున్నీసాలు ప్రసంగించారు. అనంతరం ఉపకులపతి గోపాల్‌ను ఘనంగా సన్మానించారు.



ఓవరావల్ చాంపియన్ సాధించిన విద్యార్థులు

కోర్టులో గంగమ్మకు విశేష పూజలు



మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): స్థానిక కోర్టులో వెలసిన గంగమ్మకు మాఘమాసం మొదటి శుక్రవారం ఆలయ కమిటీ ప్రత్యేక అలంకరణలో విశేషపూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయ అర్చకుడు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు రాహుకాల సమయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మకు చీర, జాకెట్లు, పొంగళ్ల నైవేద్యం సమర్పించారు. నిమ్మకాయలపై నెయ్యి వత్తులతో దీపారాధన చేశారు. ఆలయకమిటీ అధ్యక్షుడు మార్పూరి చిన్నరెడ్డెప్ప, ఉపాధ్యక్షుడు పెరవలి వేణుగోపాల్ నాయుడు కార్యదర్శి మార్పూరి ప్రభాకర్ నాయుడు, ట్రెజరర్లు రంగస్వామి నాయుడు, కరుణాకర్ నాయుడు, మార్పూరి విక్కీ, మార్పూరి మహేష్, దేవేంద్ర, శ్రీనివాసులు పర్యవేక్షించారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న గ్రామస్థులు

రామసముద్రం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): చిట్టెంవారిపల్లెలో వీధిని, చెరువును ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. గ్రామస్తుల వివరాల మేరకు మానేవారిపల్లె పంచాయతీ చిట్టెంవారిపల్లె వాసి అంజప్ప రోడ్డును ఆక్రమించి దారికి అడ్డంగా ముళ్ల కంచె వేశాడు. గ్రామ సమీపంలోని చిట్టెంవారిపల్లె చెరువును ఆక్రమించి వివిధ పంటలు సాగు చేస్తూ పశువులు, గొర్రెలు మేత మేయడానికి వీలులేకు చేశాడు. వీటిపై అంజప్పను పలువురు గ్రామస్థులు ప్రశ్నించగా వారిపై దాడికి పాల్పడుతున్నాడని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై గతంలో గ్రామస్థులు తహసీల్దార్‌కు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో విచారణ జరిపిన తహసీల్దార్ నిర్మలాదేవి చెరువు, దారిని వదిలేయాలని అంజప్పను ఆదేశించారు. అయితే ఆక్రమణకు గురైన చెరువును, దారిని అంజప్ప ఇంతవరకు వదలకపోవడంతో శుక్రవారం గ్రామస్థులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ అంజప్ప, అతని అనుచరులుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బుధవారం పోలీసు, రెవెన్యూ సిబ్బందితో గ్రామానికి వచ్చి సమస్యలను పరిష్కరిస్తామని గ్రామస్థులతో తహసీల్దార్ తెలిపారు.

షాదీ మహల్, ఖబరస్థాన్ నిర్మాణానికి సహకరిస్తాం



మసీదు కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి

పీలేరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): యల్లమంద క్రాస్ వద్ద నిలిచిపోయిన షాదీ మహల్, ఖబరస్థాన్‌ల నిర్మాణం పూర్తయ్యేందుకు సహకరిస్తానని ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి ప్రకటించారు. నిలిచిపోయిన షాదీ మహల్, ఖబరస్థాన్‌ను శుక్రవారం పరిశీలించిన ఆయన మాట్లాడుతూ తన అన్న నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మంజూరు చేసిన నిధులతో నిర్మాణాలు ప్రారంభమైన షాదీ మహల్, ఖబరస్థాన్ నిధుల లేమితో నిలిచిపోవడం బాధాకరమన్నారు. వైసీపీ ప్రభుత్వం వాటి గురించి పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. టీడీపీ నేతలు కోటపల్లె బాబు రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, బాబ్జీ రెడ్డి, అమరనాథరెడ్డి, పురం రామ్మూర్తి, పోలిశెట్టి సురేంద్ర, హనీఫ్, షరీఫ్, అమీర్, నజీర్, షంషీర్, బోదేషా, ముస్తఫా, అల్లాబక్షు, తదితరులు పాల్గొన్నారు.

పాల ఉత్పత్తులతో ఆర్థికాభివృద్ధి సాధించాలి

పెద్దమండ్యం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): పాల ఉత్పత్తులతో ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని రాష్ట్ర కామధేను ఎఫ్‌పీఓ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. పెద్దమండ్యం సమీపంలో ప్రభుత్వ నిధులతో నిర్మించిన కలెక్షన్ సెంటర్‌ను పరిశీలించారు. ప్రభుత్వ ఉద్యానవన శాఖ ద్వారా సరఫరా అయిన పాడి ఆవుల పాల ఉత్పత్తులు, వృద్ధి రకాల పశుదాన, టానిక్‌ల ఉత్పత్తులను పరిశీలించారు. మండల కామధేను రైతు ఉత్పత్తిదారుల సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాడి రైతు కుటుంబాలు అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఉద్యాన శాఖ జిల్లా అధికారి రవిచంద్ర, తంబళ్లపల్లి హెచ్‌ఓ భీమేష్, ప్రాజెక్టు మేనేజర్ అబ్దుల్ ఖాదర్, ఆర్బీకే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేబుల్ వైర్లు వరుస చోరీ

నిమ్మనపల్లి ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): అగ్రహారం పంచాయతీ ఆరిపిరెడ్డిగారిపల్లిలో వరుసగా కేబుల్‌వైర్లు చోరీ జరుగున్నాయని శుక్రవారం రైతు వేణుగోపాల్‌రెడ్డి ఫిర్యాదు చేశాడు. గురువారం రాత్రి అమలమ్మ, రాఘవరెడ్డి, రాజారెడ్డి వ్యవసాయ బోర్ల వద్ద విద్యుత్ కేబుల్ వైర్లను దొంగలు చోరీ చేశారు. దాదాపు 10వ్యవసాయ బోర్ల వద్ద లాగిన వైర్లను దోచుకెళ్లినట్లు తెలుస్తోంది. దీని విలువ దాదాపు రూ.2లక్షలు వుంటుందని రైతులు తెలిపారు. శుక్రవారం పంటలకు నీరు పెట్టేందుకు బోరు వద్దకు వెళ్లగా వైర్లు లేవని తెలిపారు.

ఆదాయపు పన్నుశాఖ కార్యాలయం మార్పు

మదనపల్లె, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదాయపు పన్ను కార్యాలయం గ్రూపు థియేటర్లు ఉన్న ఎన్‌ఆర్‌కే వీధి నుంచి గొల్లపల్లె రింగ్‌రోడ్డులోని ఎస్‌బీఐ కాలనీకి మార్పు చేశారు. ఈ కొత్త భవనాన్ని తిరుపతి అడిషనల్ కమిషనర్ టి.వి.వంశీధర్ ప్రారంభించారు. అడ్వాన్స్ టాక్సు ప్రాముఖ్యత, ఫ్రాండులెంట్ రీఫండ్స్ వల్ల వచ్చే చిక్కులను అధికారులు, ఖాతాదారులకు వివరించారు. కార్యక్రమంలో స్థానిక ఆదాయపు పన్నుశాఖ అధికారి టి.మహమ్మద్‌ఫారూఖ్, ఇన్‌స్పెక్టర్ సూర్యబాబు నాయక్, కార్యాలయ సిబ్బంది, ట్యాక్స్ బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఘూటింగ్ బాల్ విజేతకు అభినందన



యూసుఫ్‌ను అభినందిస్తున్న జనసేన నేతలు

మదనపల్లె, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఘూటింగ్ బాల్‌లో బంగారు పతకం సాధించిన యూసుఫ్‌ను జనసేన నేతలు శ్రీరామ రామాంజనేయులు, శ్రీరామ హరిహరన్ అభినందించారు. నేపాల్‌లో జరిగిన రెండో ఏషియన్ ఛాంపియన్‌షిప్ ఘూటింగ్ బాల్లో భారత్‌జట్టులో పాల్గొని గోల్డ్‌మెడల్ సాధించాడు. దీంతో శుక్రవారం మదనపల్లెకు చేరుకున్న విజేతను జనసేన నేతలు కలసి అభినందించారు. క్రీడారంగంలో యువత ముందుంటారని, ఇందులో భాగంగా యూసుఫ్ గెలిచిన గోల్డ్‌మెడల్ మదనపల్లెకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిందని కొనియాడారు. సీనియర్ ఘూటింగ్ బాల్ క్రీడాకారుడు ఉదయ్, జిల్లా ఘూటింగ్ బాల్ సెక్రకటరీ గౌతమి నరేష్, పట్టణ అధ్యక్షుడు నాయిని జగదీష్‌బాబు, సోమశేఖర్, సోను, సత్య, లోహిత్ పాల్గొన్నారు.

సలహాదారుకు సమస్యల తో'రణం'

పడకేసిన మైనారిటీల సంక్షేమం ● నేడు మైనారిటీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారు పర్యటన



కొత్త షాదీ మహల్ నిర్మాణం కోసం ఎంపీ, ఎమ్మెల్యేలు వేసిన శిలాఫలకం





శిథిలావస్థలో వాల్మీకిపురం షాదీ మహల్ - అసంపూర్తిగా మిగిలిపోయిన నూతన భవనాలు

పీలేరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): అరకొర విద్యా వసతులు, శిథిలావస్థలో ఉన్న షాదీ మహళ్లు, అందని ఇమామ్, మౌజన్‌ల జీతాలు తదితర సమస్యలు మైనారిటీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారు ఎం.ఎ.షరీఫ్‌కు స్వాగతం పలుకుతున్నాయి. వైసీపీ ప్రభుత్వంలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురైన ముస్లిం మైనారిటీల సంక్షేమం ఆయన రాకతోనైనా పుంజుకుంటుందేమో....

అధ్వాన స్థితిలో షాదీ మహళ్లు

పీలేరు నియోజకవర్గంలోని పీలేరు, కలికిరి, వాల్మీకిపురం, కలకడ, గుర్రంకొండ మండలాల్లోని షాదీ మహళ్లు శిథిలావస్థలో ఉన్నాయి. పీలేరులో షాదీ మహల్‌ను కూల్చి కొత్తగా నిర్మిస్తామని వైసీపీ పాలకులు ఆర్భాటంగా ప్రకటించినా అది శిలాఫలకానికే పరిమితమైంది. రూ.2 కోట్లు వెచ్చిస్తామన్న అప్పటి ఎంపీ, ఎమ్మెల్యేలు వాటిపట్ల ఆరా తీసిన దాఖలాలు లేవు. పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి ఎంపీ ల్యాడ్స్ ద్వారా తొలి విడతగా రూ.50 లక్షలు మంజూరు చేస్తే వాటికి పీలేరు గ్రామ పంచాయతీ నుంచి రూ.50 లక్షలు మ్యాచింగ్ గ్రాంట్ విడుదల చేసేలా ప్రణాళిక రూపొందించారు. ఆర్థిక కష్టాల్లో కొట్టుమిట్టాడుతున్న పంచాయతీ నుంచి ఒక్కసారిగా అంత పెద్ద మొత్తం మంజూరు చేయడం సాధ్యం కాని పని అని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఎంపీ ల్యాడ్స్ మంజూరై ఉంటే అంతో ఇంతో పనులు మొదలయ్యేవని, అవి కూడా రాకపోవడంతో అటువైపు తొంగి చూసేవారు కరవయ్యారు. ప్రస్తుతం అక్కడ శిలాఫలకం వెక్కిరిస్తూ కనబడుతోంది. కలకడలో పేరుకు మాత్రమే షాదీ మహల్ ఉంది. ఆర్థిక స్థోమత లేనివారు శుభకార్యాల కోసం పీలేరు, గుర్రంకొండ, రాయచోటి ప్రాంతాల్లోని ప్రైవేటు ఫంక్షన్ హాళ్లకు వెళ్లలేక ఇక్కడే చేసుకుంటున్నారు. గుర్రంకొండలో ఇప్పటి వరకు షాదీ మహల్ నిర్మాణం జరగలేదు. నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు దాని నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరు చేసినా స్థలం లేకపోవడంతో నిర్మాణం ప్రారంభం కాలేదు. వాల్మీకిపురం షాదీ మహల్‌లో తాగునీరు, మరుగుదొడ్డి సౌకర్యాలు అంతంత మాత్రమే.

అసంపూర్తిగా ఉర్దూ పాఠశాల భవనాలు

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఉర్దూ విద్యకు పెట్టింది పేరైన పీలేరులో నాలుగు దశాబ్దాలుగా ఉర్దూ పాఠశాల నడుస్తోంది. రొంపిచెర్ల, సదుం, చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం, పులిచెర్ల కేవీపల్లె మండలాల నుంచి చాలా మంది విద్యార్థులు పీలేరులోని ఉర్దూ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో చదివేవారు. ఇరవై ఏళ్ల కిందట ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేశారు. టెన్త్ తర్వాత ఇంటర్, డిగ్రీ కోసం అప్పటి ఉమ్మడి కడప జిల్లాలోని రాయచోటికి వెళ్లేవారు. దశాబ్దాల కిందట నిర్మించిన భవనం కావడంతో ఉర్దూ ఉన్నత పాఠశాలలోని తరగతి గదులు చాలక విద్యార్థులు ఇబ్బందులు పడేవారు. దీంతో 2018లో రాష్ట్రీయ మాధ్యమిక శిక్ష అభియాన్ (ఆర్ఎంఎస్ఏ) కింద ఐదు నూతన గదులు నిర్మించేందుకు అప్పటి ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. రూ.53 లక్షల ఆర్ఎంఎస్ఏ నిధులతో ఉర్దూ ఉన్నత పాఠశాల కోసం తరగతి గదులు నిర్మించేలా ప్రభుత్వం పాఠశాల అభివృద్ధి కమిటీకి బాధ్యతలు అప్పగించింది. తొలివిడత పాఠశాల ఖాతాలో రూ.23.50 లక్షల నిధులు జమయ్యాయి. పాక్షిక బిల్లుల చెల్లింపు ఉంటుందన్న భరోసాతో పాఠశాల కమిటీ సభ్యులు మరో రూ.45 లక్షల విలువైన పనులు అదనంగా చేశారు. జిల్లాల విభజనలో పీలేరు అన్నమయ్య జిల్లాలోకి చేరింది. దీంతో పాఠశాల నిధులకు సరిహద్దు తగాదా వచ్చిపడింది. అంతేకాకుండా మీరంటే మీరు బాధ్యత వహించాలని ఇరు జిల్లా అధికారులు వదిలేశారు. అటు అధికారులు, ఇటు ప్రజా ప్రతినిధులను వేడుకున్నా ఫలితం లేదు. పీలేరు పర్యటనకు వస్తున్న సలహాదారు షాదీ మహళ్లు, విద్యావసతుల గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తారని మైనారిటీలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులను బిడ్డల్లా చూసుకోవాలి



మైనారిటీ విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎంఏ షరీఫ్

వాల్మీకిపురం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఏపీ మైనార్టీ బాలికల గురుకుల కళాశాల, పాఠశాలల్లో విద్యార్థినులను సొంత బిడ్డల్లా చూసుకోవాలని మైనార్టీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారుడు, ఎంఏ షరీఫ్ సూచించారు. శుక్రవారం సాయంత్రం తరిగొండ రోడ్డులోని మైనారిటీ బాలికల గురుకుల జూనియర్ కళాశాల, పాఠశాలలను సందర్శించిన ఆయన విద్యార్థినులకు వసతులు, భోజనం, బోధనపై స్వయంగా పర్యవేక్షించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక తరగతులు నిర్వహించి మంచి ఫలితాలు సాధించేలా చర్యలు చేపట్టాలని యాజమాన్యాలను ఆదేశించారు. విద్యార్థినులు కూడా తల్లిదండ్రుల కష్టాలను గుర్తించి చక్కగా చదువుకున్నప్పుడే ఉజ్వల భవిష్యత్తు చేకూరుతుందన్నారు. వాల్మీకిపురంలో మైనార్టీ ఉర్దూ డిగ్రీ కళాశాల మంజూరు చేయించాలని కోరగా తప్పక ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకునేలా చూస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర సివిల్ సప్లైయ్స్ డైరెక్టర్ ఫర్వీన్‌తాజ్, పీలేరు టీడీపీ మైనారిటీ అధ్యక్షుడు సయ్యద్‌బాషా, నేతలు ఎస్‌ఏ మస్తాన్, కువైట్ సయ్యద్‌బాషా, డిష్ బ్రదర్స్ కువైట్ బాబు, కలందర్, మున్వ ర్, యూసుఫ్, ప్రిన్సిపాల్స్ రమామంజుల, నవమల్లిక, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మండలి మాజీ చైర్మన్‌కు ఘన స్వాగతం

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): హార్సిలీహిల్స్ నుంచి మదనపల్లెకు వచ్చిన షరీఫ్‌కు మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఘనస్వాగతం పలికారు. ఎమ్మెల్యే నివాసంలో షరీఫ్ మాట్లాడుతూ మదనపల్లెలో ముస్లిం మైనారిటీ అభ్యర్థిని నిలబెట్టడంతో ఇక్కడ టీడీపీ గెలిచిందన్నారు. రాష్ట్రంలో ముస్లిం మైనారిటీలు టీడీపీని ఆదరించారన్నారు. దీనికి నిదర్శనమే రాష్ట్రంలో టిక్కెట్లు ఇచ్చిన మూడు చోట్లా ముస్లింలు విజయం సాధించారని, వైసీపీ ఏడు చోట్ల ముస్లింలకు టికెట్లు ఇస్తే పరాజయం పొందారన్నారు. రాబోయే రోజుల్లో ముస్లిం సంక్షేమానికి కృషి చేస్తారని, వారి మనోభావాలను చంద్రబాబు గౌరవిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లైస్ రాష్ట్ర డైరెక్టర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పర్వీన్‌తాజ్, ముస్లిం మైనారిటీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్‌ఏ మస్తాన్, బాబాఫకృద్దీన్ పాల్గొన్నారు

హార్సిలీహిల్స్‌లో...

మదనపల్లె, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మైనార్టీ రాష్ట్ర వ్యవహారాల సలహాదారుడు షరీఫ్ మొహమ్మద్‌కు మదనపల్లె టీడీపీ మైనార్టీ సీనియర్ నేత ఎస్.ఎ.మస్తాన్ ఘనస్వాగతం పలికారు. హార్సిలీహిల్స్‌కు విచ్చేసిన షరీఫ్‌ను మస్తాన్ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఒదులో సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ ఎస్.ఎం.పర్వీన్‌తాజ్, ఎన్.సాజీద్ ఉన్నారు.

స్కూల్‌లో వెట్టిచాకిరీ కామన్‌గా మారింది

● సామాజిక తనిఖీలో బహిర్గతం



తల్లిదండ్రులతో మాట్లాడుతున్న సామాజిక తనిఖీ సభ్యుడు

బి.కొత్తకోట, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు, కస్తూర్బా గురుకులాల్లో విద్యార్థుల చేత వెట్టిచాకిరి కామన్‌గా మారినట్లు కనిపిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో సిబ్బంది పనితీరు, విద్యార్థుల అవసరాలపై అధ్యయనం చేసేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే గోళ్లపల్లె జడ్పీ హైస్కూల్‌లో రెండురోజులు వివిధ అంశాలపై విచారించిన తనిఖీ బృందం శుక్రవారం పాఠశాలలో విద్యార్థుల తల్లితండ్రుల సమావేశంలో పలు విషయాలను వెల్లడించారు. ప్రభుత్వం రూపొందించిన మెనూ ప్రకారం మధ్యాహ్నభోజన పథకం అమలు చేయడం లేదని, రాత్రిళ్లు పాఠశాల ఆవరణలో మందుబాబులు మద్యం తాగుతున్నారని, పిల్లల చేత క్లాస్‌రూంలు, పాఠశాల ఆవరణలో ఊడ్పించడం లాంటి పనులు చేయిస్తున్నారని తనిఖీ బృందం బహిర్గతం చేసింది. బాలికల భద్రత విషయంలో తల్లితండ్రులు కూడా బాధ్యత వహించాలని కోరారు. సామాజిక తనిఖీలో తేలిన అంశాలు విలేకరులకు తెలిపేందుకు పాఠశాల సిబ్బంది, తనిఖీ సిబ్బంది సైతం విముఖత వ్యక్తం చేయడం అనేక అనుమానాలకు తావిస్తోంది.

పీటీఎం ఆదర్శ పాఠశాలలో...

పెద్దతిప్పసముద్రం ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పీటీఎం ఆదర్శ పాఠశాలలో మౌలిక వసతులు, మధ్యాహ్న భోజనం, పాఠశాల రికార్డుల నిర్వాహణ, సమగ్ర శిక్ష అభియాన్ రికార్డులు, పాఠశాలలో మౌలిక వసతులపై సామాజిక తనిఖీ బృందం పరిశీలించి శుక్రవారం తల్లిదండ్రులతో సమావేశమయ్యారు. మౌలిక వసతులపై సా మాజిక తనిఖీ బృందం అధ్యయనం చేసింది.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెద్దతిప్పసముద్రం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): వివిధ గ్రామాల్లో నేడు ఉదయం 9గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతున్నట్లు పెద్దతిప్పసముద్రం మండల ట్రాన్స్‌కో ఏఈ రామలక్ష్మయ్య తెలిపారు. ములకలచెరువు మండలం బురకాయకోట సమీపంలోని 132 కేవీ సబ్ స్టేషన్‌లో మెయిన్ విద్యుత్ ట్రాన్స్‌పార్మర్లలో సాంకేతిక లోపం ఉన్న కారణంగా ట్రాన్స్‌పార్మర్‌ను మరమ్మత్తులు చేపడుతున్నారన్నారు. దీంతో పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోట ములకలచెరువు మండలాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

సబ్సిడీ రుణాల దరఖాస్తుకు గడువు పెంపు

నిమ్మనపల్లి ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): సబ్సిడీతో బీసీ కార్పొరేషన్ రుణాల గడువును 12 వరకు పెంచినట్లు ఎంపీడీఓ పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ బీసీ కార్పొరేషన్ కింద 50శాతం సబ్సిడీతో 45యూనిట్లు మంజూరు కాగా, ఒక్కో యూనిట్ రూ.2లక్షలుగా వుందన్నారు. కాపు కార్పొరేషన్ కింద 14యూనిట్లు మంజూరు కాగా రూ.2లక్షల వంతన ఇద్దరికి, రూ.3లక్షల వంతున 7మందికి, రూ.5లక్షల వంతున ఐదుగురికి ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ బీసీ కేటగిరీల్లో 2యూనిట్లు , రెడ్డి సామాజిక వర్గానికి 2యూనిట్లు మంజూరైనట్లు తెలిపారు. మొత్తం అన్ని రుణాలు 50శాతం సబ్సిడీతో మంజూరు చేస్తామన్నారు. ఋణాలు పొందేందుకు ఫిబ్రవరి 12వతేదీ వరకు అవకాశం వుందని లబ్ధిదారులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుచేసుకోవాలని తెలిపారు.

పీలేరులో ఉర్దూ కళాశాల ఏర్పాటు చేయాలి

పీలేరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఉర్దూ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని ప్రభుత్వ మైనారిటీ వ్యవహారాల సలహాదారులు ఎం.ఎ.షరీఫ్‌కు ఎన్టీఆర్ నఫీస్ విజ్ఞప్తి చేశారు. పీలేరులో ఉర్దూ చదివే విద్యార్థులు గణనీయ సంఖ్యలో ఉన్నారని, టెన్త్ పూర్తయిన తరువాత జూనియర్ కళాశాల లేకపోవడంతో వారందరూ ఉర్దూ విద్యకు దూరమవుతున్నారన్నారు. జూనియర్ కళాశాల, ఉర్దూ అకాడమీ ద్వారా ఉర్దూ కంప్యూటర్ శిక్షణ కేంద్రం, గ్రంథాలయం కూడా ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. కలికిరిలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో నఫీస్ ఈ మేరకు వినతి పత్రం అందజేశారు.

వైద్య సేవలు సద్వినియోగం చేసుకోండి

వాల్మీకిపురం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రిలో కార్పొరేట్‌కు దీటుగా అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని వాల్మీకిపురం ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఆస్పత్రికి వచ్చిన ఓ రోగికి కాలిలో ఇరుక్కుపోయిన మేకు, చెక్కముక్కను సర్జరీ చేసి బయటికి తీశారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌కు గురై పావురాలు మృతి

రామసముద్రం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మట్టవారిపల్లెలో విద్యుత్ షాక్‌తో పావురాలు కాకులు మృతి చెందుతున్నాయని గ్రామస్తులు అంటున్నారు. గ్రామంలోని రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ టవర్‌పై పక్షులు కూర్చుంటే అవి కరెంట్ షాక్‌కు గురై చనిపోతున్నాయి. ఇప్పటి వరకు మూడు సార్లు కరెంట్ షాక్‌తో నాలుగు పావురాలు, రెండు కాకులు మృతి చెందాయని ప్రజలు తెలిపారు. కరెంట్ వైర్లకు ఉండే పింగాణీ పరికరానికి ఇనుప కాసారానికి దూరం తక్కువగా ఉండడంతో తీగపై కూర్చున్న పక్షుల తోకకాసారానికి తగిలి తోక ద్వారా విద్యుత్ ప్రవహించి పక్షులు చనిపోయి ఉండవచ్చని ఎలక్ట్రికల్ మెకానిక్‌లు చెబుతున్నారు. ఏదేమైనా అధికారులు చొరవ తీసుకుని పక్షుల మృతికి గల కారణాలు తెలుసుకుని పక్షుల ప్రాణాలు కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

జిల్లా మహాసభను విజయవంతం చేయండి

బి.కొత్తకోట, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఈ నెల 16, 17లలో జరగనున్న ఏఐటీయూసీ మహాసభలను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ తంబళ్లపల్లె నియోజకవర్గ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు వేణుగోపాల్ రెడ్డి, సలీంబాషా పిలుపునిచ్చారు. శక్రవారం బి.కొత్తకోటలోని తమ కార్యాలయంలో అనుబంధ సంఘాలతో కలిసి మహాసభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ శ్రామికవర్గాన్ని ఏకం చేస్తూ, అమరవీరుల అడుగుజాడల్లో కార్మిక, ఉద్యోగవర్గాలకు అండగా పోరుచేస్తున్న ఏఐటీయూసీకి మద్దతుగా అందరూ తరలి వచ్చి మహాసభలను విజయవంతం చేయాలని అన్నారు. కార్యక్రమంలో పలువురు ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

పాండురంగస్వామి అలంకరణలో లక్ష్మీజనార్దనుడు



రామసముద్రం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీజనార్దనస్వామి వారి రథసప్తమి వేడుకల్లో భాగంగా శుక్రవారం స్వామి వారు పాండురంగస్వామి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి దశావతారాల్లో భాగంగా రోజూ ఒక్కో అవతారంలో భక్తులకు స్వామివారు దర్శనమిస్తారని అర్చకులు తెలిపారు. ఈనెల 11న మంగళవారం భూదేవి సమేతంగా లక్ష్మీజనార్దనస్వామి కల్యాణోత్సవం, 12న శనివారం స్వామివారి బ్రహ్మరథోత్సవం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్



బాధ్యతలు చేపడుతున్న ధనంజయులు

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మదనపల్లె తహసీల్దార్‌గా శుక్రవారం ధనంజయులు బాధ్యతలు స్వీకరించారు. డిప్యుటేషన్‌పై నిమ్మనపల్లె తహసీల్దార్ కార్యాలయం నుంచి మదనపల్లెకు బదిలీ చేశారు. ఈ మేరకు ఆయన మదనపల్లె తహసీల్దార్ కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించారు.

రూరల్ సీఐగా సత్యనారాయణ...



బాధ్యతలు చేపడుతున్న సత్యనారాయణ

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మదనపల్లె రూరల్ సీఐగా ఎ.సత్యనారాయణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అన్నమయ్య జిల్లా స్పెషల్ బ్రాంచ్ సీఐగా పని చేస్తున్న ఆయన బదిలీపై మదనపల్లె రూరల్ సీఐగా వచ్చారు. ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించి న్యాయం చేస్తామన్నారు.

రామసముద్రం ఎస్ఐగా రవికుమార్



రామసముద్రం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): రామసముద్రం ఎస్ఐగా రవికుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న వెంకటసుబ్బయ్య అవినీతి ఆరోపణలపై ఏసీబీకి పట్టుబడి రిమాండ్‌లో ఉన్నారు. బాధ్యతలు చేపట్టిన రవికుమార్ పీటీఎం మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు.

కేంద్రమంత్రిని కలిసిన జబ్బల

మదనపల్లె, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి ఎస్.పి.సింగ్‌భాగేల్‌ను కురబసంఘం రాష్ట్ర అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులు కలిశారు. ఢిల్లీలోని మంత్రి నివాసంలో శుక్రవారం కలిసి జ్ఞాపికను అందజేశారు. భక్త శ్రేష్ఠ కనకదాసు జయంతి ఉత్సవాల జ్ఞాపికను స్వీకరించిన కేంద్రమంత్రి మాట్లాడుతూ కురబలు విద్య, వ్యాపార, రాజకీయాల్లో రాణించాలని, పార్టీలకు అతీతంగా అభివృద్ధికి ఐక్యంగా ముందుకు సాగాలన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా ముకుంద

బి.కొత్తకోట, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట బీజేపీ అధ్యక్షుడిగా మేడా ముకుందబాబు ఎన్నికైనట్లు ఆ పార్టీ నేతలు తెలిపారు. జిల్లా ఎన్నికల ఏఆర్ఓ గోరంట్ల రమేష్ ఆధ్వర్యంలో కార్యవర్గ సమావేశంలో ముకుందను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల నూతన కార్యవర్గాన్ని త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. పరిశీలకుడిగా జిల్లా నేత ప్రశాంత్, నేతలు శీలం రంగారెడ్డి, సాయిప్రసాద్, రవీంద్ర, సుబ్బన్న, మురళి, మంజునాథరెడ్డి పాల్గొన్నారు.